RNI: TEL TEL /2019/12836

# అభ్యుదయం

The Pride of Telugu national daily



Wanted Reporters
తెలుగు రాష్ట్రాల్లో
నియోజక వర్గాల వారిగా
విలేఖరులు కావలెను
తెలంగాణ :- 9700026263
ఆంధ్రప్రదేశ్:- 9885426263

పబ్లిషర్ :ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ ఆదివారం 13- 9- 2026 సంపుటి : 6 సంచిక : 217 ఎడిటర్ : ఆనంద్ రావు పేజీలు : 8 వెల : 3-00

## భారత్, చైనా కలిసి నడవాలి




పరస్పరం సహకరించుకోవాలి
చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ వెల్లడి
నిర్మాణాత్మక చర్చలకు మేం సిద్ధం
ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు
భారత ప్రధాని మోదీ ద్వైపాక్షిక భేటీ
సరిహద్దు వివాదంపై ఇరువురు చర్చ
ఏడేళ్ల తర్వాత జిన్‌పింగ్

## రూ.253 కోట్లతో అమరావతిలో అతిపెద్ద ఫోరెన్సిక్ ల్యాబ్




-ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా

# ధరణి పోర్టల్ తో వేలాది ఎకరాలు చెర




- నిషేధిత భూముల జాబితా కొత్తది కాదు
- భూములను కొల్లగొట్టకూడదనే
- చట్టం
- ధరణిలో 23 వేల ఎకరాల అక్రమాలు..
- భూభారతి ఆషామాషీగా తీసుకురాలేదు
- అసెంబ్లీలో మంత్రి పొంగులేటి వెల్లడి
- 22ఏపై అసెంబ్లీలో వాడీవేడీగా చర్చ
ఈనెల 16కు శాసనసభ వాయిదా

హైదారాబాద్,అభ్యుదయం

తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు భూముల వ్యవహారం హాట్‌టాపిక్‌గా మారింది. ముఖ్యంగా 22ఏ నిషేధిత భూముల జాబితా అంశం అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. 22ఏకారణంగా రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని, భూముల రిజిస్ట్రేషన్లు తగ్గిపోయాయని, ప్రభుత్వ ఆదాయానికి గండి పడిందని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలను కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తోంది. తాజాగా అసెంబ్లీలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గణాంకాలతో బీఆర్ఎస్‌కు కౌంటర్ ఇచ్చారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 22ఏ అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని టార్గెట్ చేశారు.

- మిగతా 2లో

## బ్లూ సిటీ, గ్రీన్ సిటీగా హైదరాబాద్

- హైదరాబాద్ వైభవాన్నికాపాడుతాం
- సమర్థంగా పాలన కోసం క్యూర్ చట్టం
- మంత్రి శ్రీధర్? బాబు కీలక వ్యాక్యలు
- శాసనసభలో క్యూర్?- 2026 బిల్లు..




హైదారాబాద్, అభ్యుదయం

కోర్ అర్బన్ రీజియన్ ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్ బిల్లు-2026ను మంత్రి శ్రీధర్‌బాబు శాసన సభలో ప్రవేశపెట్టారు. హైదరాబాద్‌ను బ్లూ సిటీ, గ్రీన్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా బిల్లు తెచ్చినట్లు ఆయన స్పష్టం చేశారు. రాబోయే 30 ఏళ్ల అవసరాల దృష్ట్యా క్యూర్ చట్టంలో మార్పులకు శ్రీకారం

# ప్రపంచ పాలన మారాలని బ్రిక్స్ దేశాలు పిలుపు

### అభివృద్ధి చెందుతున్న దేశాలకు మరింత ప్రాతినిధ్యం కావాలి

### ఏకపక్ష సుంకాలు, ఆంక్షలు అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధం




- అవి ప్రపంచ వాణిజ్యానికి విఘాతం
- 'బ్రిక్స్ పేమెంట్ టాస్క్‌ఫోర్స్' పని వేగవంతం
- స్థానిక కరెన్సీలలో పరస్పర చెల్లింపులు
- బ్రిక్స్ ఎన్‌డీబీ బ్యాంకు మరింత బలోపేతం
- పశ్చిమాసియాలో పరిస్థితి ఆందోళనకరం
- బలప్రయోగంతో కాదు.. దౌత్యంతో పరిష్కారం
- పహల్గాం ఉగ్రదాడికి ఖండన.. ఉగ్రవాదాన్ని సహించొద్దు
- 45 పేజీల్లో 140 అంశాలతో బ్రిక్స్ 'న్యూఢిల్లీ డిక్లరేషన్'

న్యూఢిల్లీ,అభ్యుదయం: ప్రపంచ పాలన మారాలని బ్రిక్స్ దేశాలు పిలుపునిచ్చాయి. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి, ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్, డబ్ల్యూటీవో సహా అంతర్జాతీయ సంస్థలను పునర్వ్యవస్థీకరించి.. అభివృద్ధి చెందుతున్న దేశాలకు మరింత ప్రాతినిధ్యం కల్పించాలని కోరాయి. అదే సమయంలో ఏకపక్ష సుంకాలు, ఆర్థిక ఆంక్షలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. ప్రపంచ వాణిజ్యానికి విఘాతం కలిగించే ఆంక్షలను తొలగించాలని డిమాండ్ చేశాయి. అంతేగాకుండా డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించుకునే దిశగా అడుగులు వేయాలని నిర్ణయానికి వచ్చాయి. బ్రిక్స్ దేశాల మధ్య చెల్లింపులన్నీ స్థానిక కరెన్సీల్లో జరిగేలా చూడాలని తీర్మానించాయి. ఈ మేరకు బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో 'న్యూఢిల్లీ డిక్లరేషన్'కు ఆమోదం తెలిపాయి. రష్యా, చైనా అధ్యక్షులు పుతిన్, జిన్‌పింగ్, ఇతర దేశాల నేతల సమక్షంలో

మిగతా 2లో

## అవినీతిపై ప్రశ్నిస్తున్నందుకే తనపై నిందలా..?

- 22ఏలో ఏ1 ముమ్మాటికీ రేవంత్‌రెడ్డే.. ఏ2 పొంగులేటే!
- తప్పు మీరు చేసి బీఆర్ఎస్‌పై నెపమా?
- కాంగ్రెస్ అవినీతిపై ప్రశ్నిస్తున్నందుకే మాపై నిరాధార ఆరోపణలు చేస్తున్నరు
- మా మామ భూములతో నాకు లింకేంది?
- ఎక్స్ సర్వీస్‌మెన్‌కు 1995లో కాంగ్రెస్ అలాట్ చేసిన భూమినే ఆయన కొన్నడు
- 2010లో కాంగ్రెస్సే ఎన్వోసీ ఇచ్చింది
- పొంగులేటి చేసిన ఆరోపణలు అవాస్తవం
- ఆయన కొడుకు బాగోతాలు బయటకు పొక్కినందుకే మాపై బురద చల్లుతున్నడు
- బీఆర్ఎస్ సభ్యులను బహిష్కరించి మంత్రి అబద్ధాల వరద పారించిండు
- బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ లీడర్ హరీశ్ ఫైర్




హైదరాబాద్, అభ్యుదయం

రాష్ట్రంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వైఫల్యాలు, అవినీతిపై ప్రశ్నిస్తున్నందుకే తనపై ఆరోపణలు చేస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎల్పీ డిప్యూటీ లీడర్ హరీశ్‌రావు మండిపడ్డారు. 22ఏ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఏ-1 ముద్దాయి అని, ఏ-2 రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అని విమర్శించారు. శనివారం తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. శాసనసభ నుంచి బీఆర్ఎస్ సభ్యులను సస్పెండ్ చేసి, ప్రభుత్వం అబద్ధాల ప్రవాహం పారించిందని మండిపడ్డారు. తమను ఉద్దేశపూర్వకంగా సెషన్ మొత్తం సస్పెండ్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.మహిళా ఎమ్మెల్యేలపై హత్యాయత్నం జరిగిందని, చీరలాగి

మిగతా 2లో

## విదేశాల్లో చదివే విద్యార్థులకు గుడ్‌న్యూస్..

రూ.180 కోట్లు విడుదల చేసిన తెలంగాణ సర్కార్

తెలంగాణ ప్రభుత్వం విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు భారీ ఊరట కల్పించింది. పెండింగ్‌లో ఉన్న ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌ల కోసం రూ.179.9 కోట్లను తాజాగా విడుదల చేసింది.

2లో



# రూ.253 కోట్లతో అమరావతిలో అతిపెద్ద ఫోరెన్సిక్ ల్యాబ్

రాజమహేంద్రవరం, భీమోదయం: రీజినల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబోరేటరీలు పోలీసు నేర పరిశోధనకు వెన్నుముక లాంటివని ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా స్పష్టం చేశారు. శనివారం రాజమండ్రిలో పర్యటించిన ఆయన రాజధాని అమరావతిలోని తుళ్లూరులో రూ.253 కోట్లతో 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో దేశంలోనే అతిపెద్ద స్టేట్ లెవల్ ఫోరెన్సిక్ ల్యాబ్‌ను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు.

రాష్ట్రవ్యాప్తంగా రాజమండ్రి, తిరుపతి, అనంతపురం, విశాఖ సహా పలు కేంద్రాల్లో ఆర్ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్‌లను ఆధునికీకరిస్తున్నామని తెలిపారు. డీఎన్ఏ నివేదికలను ప్రస్తుతం 7 రోజుల్లోనే, అత్యంత కీలకమైన కేసుల్లో 13 గంటల్లోనే అందిస్తున్నామని చెప్పారు. అలాగే, సైబర్ నేరాల నియంత్రణకు జిల్లా స్థాయిలో 'క్లిక్' కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాజమండ్రి గోదావరి పుష్కరాల సందర్భంగా రద్దీ నివారణకు అధునాతన డ్రోన్లు, రికార్డింగ్ మోడ్‌లోని సీసీటీవీల ద్వారా భద్రతను పర్యవేక్షిస్తామని డీజీపీ పేర్కొన్నారు.

# భారత్, చైనా కలిసి నడవాలి

బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు దిల్లీకి వచ్చిన చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో భారత మండపంలో ప్రధాని నరేంద్ర మోదీ భేటీ అయ్యారు. ఈ క్రమంలో సరిహద్దు వివాదం, వాణిజ్యం సహా పలు అంశాలపై ఇరువురు నేతలు ద్వైపాక్షిక చర్చలు జరిపారు. అనంతరం చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్‌తో దీర్ఘకాలిక, వ్యూహాత్మక ఒప్పందాలు చేసుకుంటామని అన్నారు. అతిపెద్ద దేశాలుగా ఉన్న భారత్, చైనా కలిసి నడవాలని, అనేక విషయాల్లో పరస్పరం సహకరించుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే, ఆధునిక టెక్నాలజీ సాయంతో వేగంగా పురోగతి సాధించాలని అభిప్రాయపడ్డారు. ద్వైపాక్షిక సంబంధాల దీర్ఘకాలిక అభివృద్ధిని వ్యూహాత్మక కోణంలో ఇరుపక్షాలు దృష్టిలో ఉంచుకోవడంతోనే చైనా-భారత్ సంబంధాలు అభివృద్ధి చెందాయి. చైనా, భారత్‌లు భిన్నమైనవి. అయినప్పటికీ ఉమ్మడి అభివృద్ధిని సాధించడానికి ఇరు దేశాలు పరస్పరం మద్దతు ఇచ్చుకున్నాయి. సహాయం చేసుకున్నాయి. దిల్లీలో జరిగిన బ్రిక్స్ సదస్సుకు హాజరవడం, ప్రధాని మోదీని మరోసారి కలవడం నాకు చాలా ఆనందంగా ఉంది. భారత్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సు విజయవంతమైనందుకు మోదీకి నా హృదయపూర్వక అభినందనలు తెలిపారు. గత 12 ఏళ్లలో దిల్లీలో తాను పర్యటించడం ఇది రెండోసారని చైనా అధినేత షీ జిన్‌పింగ్ పేర్కొన్నారు. అదే సమయంలో భారత ప్రధాని మోదీని ఇప్పటివరకు 21 సార్లు కలిశానని గుర్తు చేసుకున్నారు. తత్ఫలితంగా తమ ఇద్దరి మధ్య అనేక ముఖ్యమైన ఏకాభిప్రాయాలు కుదిరాయని స్పష్టం చేశారు. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశాలుగా, గ్లోబల్ సౌత్‌లో సభ్యులుగా ఇరు దేశాల ఉమ్మడి స్థానాన్ని ఈ సందర్భంగా షీ జిన్‌పింగ్ హైలైట్ చేశారు. మానవాళి ఉమ్మడి భవిష్యత్తు కోసం చైనా, భారత్‌లకు ముఖ్యమైన బాధ్యతలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు.

## బ్లూ సిటీ, గ్రీన్ సిటీగా హైదరాబాద్

చుట్టినట్లు తెలిపారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరాలతో పోటీపడే విధంగా చేయాలనే ఉద్దేశంతో మూసీ పునరుజ్జీవం చేపట్టామని తెలిపారు. బెంగుళూరు, ముంబై, దిల్లీ మాదిరిగా హైదరాబాద్ మహా నగరపాలిక సంస్థ చట్టంలో సెక్షన్లు తగ్గించే ప్రణాళిక చేస్తున్నామని వివరించారు. హైదరాబాద్ విస్తరణ పెద్ద ఎత్తున జరుగుతోందని, రాబోయే 30 ఏళ్ల అవసరాల దృష్ట్యా మరింత సమర్థంగా పాలన కోసం క్యూర్ చట్టం తీసుకువచ్చినట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. హైదరాబాద్ గత వైభవాన్ని కాపాడుకుంటూ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా సిద్ధం చేయాలని అన్నారు. తెలంగాణ రైజింగ్-2047 పాలసీ రూపొందించుకుని ముందుకెళ్తున్నామని వివరించారు. 2034 నాటికి ట్రిలియన్, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకుని ముందుకు వెళుతున్నట్లు మంత్రి శ్రీధర్? బాబు తెలిపారు. లక్ష్య సాధనకు హైదరాబాద్ మరింత అధునాతనంగా అంతర్జాతీయ స్థాయికి చేరాలని అన్నారు. ప్రపంచ నగరాలతో పోటీపడే స్థాయికి హైదరాబాద్ ఎదగాలన్నారు. పెద్దఎత్తున పెట్టుబడులు ఆకర్షించే స్థాయికి మనం ఎదగాలని పేర్కొన్నారు. క్యూర్, ప్యూర్, రేర్ నినాదంతో రాష్ట్ర అభివృద్ధికి చర్యలున్నాయని గుర్తు చేశారు.క్యూర్' తెలంగాణ ఆర్థిక ప్రగతికి అత్యంత కీలక ప్రాంతమని, రాష్ట్ర విస్తీర్ణంలో చిన్నదైనా తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో క్యూర్ పాత్ర పెద్దదని శ్రీధర్ బాబు వివరించారు. 2025-26లో తెలంగాణ జీఎస్‌డీపీ రూ.17.82 లక్షల కోట్లకు చేరిందని, క్యూర్ పరిధిలో 10.7 శాతం వృద్ధి నమోదైనట్లు తెలిపారు. ఆర్థిక వ్యవస్థ సేవా రంగానికి సంబంధించి 68.6 శాతం వృద్ధి నమోదైందని అన్నారు. సేవా రంగం, పెట్టుబడులు, ఉపాధికి ప్రధాన కేంద్రంగా హైదరాబాద్ ఉందని అన్నారు. క్యూర్ పరిధి హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలు ఆర్థిక ఉత్పత్తిలో తొలి 3 స్థానాల్లో ఉన్నాయన్నారు. క్యూర్ ప్రాంతంలో పరిపాలన వ్యవస్థను భవిష్యత్ అవసరాల మేరకు పునర్నిర్మించాలన్నారు. హైదరాబాద్?లో రవాణా కోసం కాంప్రిహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ చేశామని శ్రీధర్? బాబు తెలిపారు. రాబోయే 30 ఏళ్ల అవసరాల దృష్ట్యా క్యూర్ చట్టం పని చేస్తుందని అన్నారు. మూసీ పునరుజ్జీవం తొలి దశకు రూ.7,345.12 కోట్లతో అనుమతులు తీసుకున్నట్లు వివరించారు. మహానగరపాలిక చట్టంలో సెక్షన్లు తగ్గించే ప్రణాళిక చేస్తున్నామన్నారు. మురుగునీటిని శుద్ధి చేసి పునర్వినియోగం చేసే దిశగా యోచన చేస్తున్నట్లు చెప్పారు. చెట్ల పెంపకం, కాలుష్య నివారణకు వాడాలనే ప్రభుత్వ ఆలోచనలు ఉన్నాయని, హైదరాబాద్‌ను బ్లూ సిటీ, గ్రీన్ సిటీగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

## కొండా సురేఖకు అధిష్ఠానం పిలుపు.

హైదరాబాద్, సెప్టెంబర్ 12: కాంగ్రెస్ పార్టీలో కొండా సురేఖ వ్యవహారం ఆసక్తికరంగా మారింది. మంత్రివర్గం నుంచి బర్తరఫ్ అయిన ఆమెకు కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి ఢిల్లీకి రావాల్సిందిగా పిలుపు అందింది. మంత్రివర్గం నుంచి తొలగించిన తర్వాత జరిగిన శాసనసభ సమావేశాలకు ఆమె దూరంగా ఉంటున్నారు. ఈ పరిస్థితులను గమనించిన హైకమాండ్ రంగంలోకి దిగి, శుక్రవారం ఆమెను రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉండాలని కోరడం, మరుసటి రోజే ఢిల్లీకి రావాలని పిలువడం రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తి రేపుతున్నది

# అవినీతిపై ప్రశ్నిస్తున్నందుకే తనపై నిందలా..?




అవమానించారని, ఆ విషయంలో ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని, మాట్లాడేందుకు తమకు అవకాశం ఇవ్వాలని అడిగితే సస్పెండ్ చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన ఘటనపై విచారణకు హామీ ఇస్తే తామంతా సభలోనే కూర్చునేవాళ్లమని చెప్పారు. ఒక్క రోజుకే సస్పెండ్ చేసి, మిగతా రోజులకు సభకు రావడానికి అవకాశం కల్పించే అవకాశం ఉన్నా, అలా చేయలేదని పేర్కొన్నారు. స్పీకర్ సభను వాయిదా వేసి, ఇలాంటి సమస్యను పరిష్కరించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని ఉదహరించారు. బీఆర్ఎస్ సభ్యులు సభలో ఉంటే అధికార పార్టీ అవినీతి, కుంభకోణాలను బయటపెడుతారనే భయంతోనే సస్పెండ్ చేశారని మండిపడ్డారు.

### ఎన్వోసీలు ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమే

తన మామ ప్రభుత్వ భూములను కబ్జా చేసినట్టు అసెంబ్లీలో మంత్రి పొంగులేటి ఆరోపించడంపై హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మా మామ హనుమంతరావు రిటైర్డ్ బ్యాంకు అధికారి. ఆయన చెక్కులు ఇచ్చి భూములను చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇద్దరు వ్యక్తుల వద్ద నుంచి ఆ భూములు కొనుగోలు చేశారు. అందులో ఒకరైన సత్యనారాయణ ఎక్స్ సర్వీస్‌మెన్. ఆయనకు 1995లో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం భూమి కేటాయించింది. అప్పటికి నేను రాజకీయాల్లో లేను.

2010లో కాంగ్రెస్ ప్రభుత్వమే సత్యనారాయణకు ఎన్‌వోసీ ఇచ్చింది. ఆ తర్వాతే మా మామ చెక్కు ఇచ్చి, భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే భూమి కేటాయింపు, ఎన్‌వోసీ, రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరిగింది. కొండపాక నా నియోజకవర్గం కాదు. అది గజ్వేల్ నియోజకవర్గంలో ఉన్నది. ఆ విషయాన్ని కూడా పొంగులేటి తప్పుగా చెప్పారు. ఆ సమయంలో కాంగ్రెస్‌కు చెందిన నర్సారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నారు' అని పేర్కొన్నారు. ఆ భూమి ఎకరం రూ.15 కోట్లు అని మంత్రి పొంగులేటి అసెంబ్లీలో అబద్ధాలు చెప్పారని హరీశ్‌రావు మండిపడ్డారు. రూ.50 లక్షలకు ఎకరం చొప్పున ఆ భూమిని అమ్ముతామని, పొంగులేటి కొంటారా? అని సవాల్ విసిరారు. 'మా మామకు భూములు అమ్మిన మరొక వ్యక్తి పేరు శ్రీనివాసచా రి. అతనికి 1995లోనే భూమి కేటాయించగా, 2011లో కాంగ్రెస్ ప్రభుత్వమే ఎన్‌వోసీ ఇచ్చింది. వాటిని కూడా మా మామ చెక్కులు ఇచ్చి కొనుగోలు చేశారు' అని స్పష్టం చేశారు.

బీఆర్ఎస్ హయాంలో మిషన్ భగీరథ పథకం కింద భూములు కోల్పోయినందుకు డబ్బులు చెల్లిం చారని మంత్రి పొంగులేటి చెప్పినవన్నీ అవాస్తవమని హరీశ్‌రావు పేర్కొన్నారు. 2011-2012 మధ్య గోదావరి సుజల స్రవంతి కింద ఎల్లం పల్లి నుంచి హైదరాబాద్‌కు వేసిన పైప్‌లైన్‌లో రెండు ఎకరాల భూమి కోల్పోయారని, అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమే పరిహారం కింద చెక్కులు ఇచ్చిందని వెల్లడించారు. ఈ మేరకు 2011లోనే మ్యుటేషన్ జరిగిందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి, ఆయన కుమారుడి బాగోతాలు బయటికి వస్తున్నాయనే కారణంతోనే తమపై బురద జల్లేందుకు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

### 22ఏపై శ్వేతపత్రం విడుదల చేయాలి

22ఏతో సహా రాష్ట్ర ప్రజలు పడుతున్న ఇబ్బందులపై తాము అడిగిన ఏ ప్రశ్నకూ మంత్రి పొంగులేటి సమాధానం చెప్పలేదని హరీశ్‌రావు అన్నారు. చిల్లర రాజకీయ ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటే అని మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఏదైనా ప్రధా న సమస్య ఉంటే విపక్షాలన్నీ అదే అంశంపై మాట్లాడటం కొత్తేమీ కాదన్నారు. 'బీఆర్ఎస్ హయాంలో రూ.19,500 కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్ చెల్లించారు, మరి కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు చెల్లించడం లేదు?' అని కాంగ్రెస్‌తో పొత్తులో ఉన్న ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ అడిగారు కదా అని హరీశ్‌రావు గుర్తుచేశారు.

## విదేశాల్లో చదివే విద్యార్థులకు గుడ్‌న్యూస్..




హైదారాబాద్, సెప్టెంబర్ 12

ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఈ నిధుల కేటాయింపు జరిగింది. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3,008 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది. విడుదలైన నిధుల్లో అత్యధికంగా ముఖ్యమంత్రి ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం కింద 1,063 మంది మైనారిటీ విద్యార్థులకు రూ.76.1 కోట్లు కేటాయించారు. అలాగే, అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి ద్వారా 1,193 మంది ఎస్సీ విద్యార్థులకు రూ.48.4 కోట్లు, 573 మంది ఎస్టీ విద్యార్థులకు రూ.36.9 కోట్లు, మహాత్మా జ్యోతిబా పూలే ఓవర్సీస్ విద్యా నిధి కింద 179 మంది బీసీ విద్యార్థులకు రూ.18.4 కోట్లు అందజేయనున్నారు. ఇప్పటికే స్కాలర్‌షిప్‌లు మంజూరైన లబ్ధిదారులందరికీ చెల్లింపులు పూర్తయ్యాయని ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులు అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల్లో తమ చదువును ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగించేందుకు ఈ నిధులు దోహదపడతాయని ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది.

..............

# ధరణి పోర్టల్ తో వేలాది ఎకరాలు చెర

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రియల్ ఎస్టేట్ రంగం గణనీయంగా అభివృద్ధి చెందిందని, భూముల విలువలు భారీగా పెరిగాయని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వ విధానాల వల్ల రియల్ ఎస్టేట్ రంగంపై ప్రతికూల ప్రభావం పడుతోందని విమర్శించారు. ఈ ఆరోపణలకు అసెంబ్లీ వేదికగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమాధానమిచ్చారు. 22ఏ కారణంగా రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ రాబడి తగ్గిపోయాయన్న ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన గణాంకాలను వెల్లడించారు. మంత్రి అసెంబ్లీకి తెలిపిన వివరాల ప్రకారం.. 2025 ఏప్రిల్, మే, జూన్, జులై, ఆగస్టు ఐదు నెలల కాలంలో రాష్ట్రంలో మొత్తం 4,90,478 డాక్యుమెంట్లు రిజిస్టర్ అయ్యాయన్నారు. అదే ఐదు నెలల కాలాన్ని 2026లో పరిశీలిస్తే 5,10,273 డాక్యుమెంట్లు రిజిస్టర్ అయినట్లు తెలిపారు. అంటే గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 19,795 డాక్యుమెంట్లు అదనంగా రిజిస్టర్ అయ్యాయని మంత్రి వివరించారు. ఇక రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి వచ్చిన ఆదాయాన్ని పరిశీలించినా తగ్గుదల కనిపించలేదని మంత్రి పొంగులేటి తెలిపారు. 2025లో ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు ఐదు నెలల్లో రూ.6,216 కోట్ల ఆదాయం వచ్చినట్లు చెప్పారు. అదే 2026లో ఐదు నెలల కాలంలో రూ.7,575 కోట్ల ఆదాయం సమకూరిందని వెల్లడించారు. అంటే గత ఏడాదితో పోలిస్తే



రూ.1,359 కోట్ల అదనపు ఆదాయం వచ్చినట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ గణాంకాలను ప్రస్తావిస్తూ 22ఏ వల్ల రిజిస్ట్రేషన్లు, ఆదాయం తగ్గిపోయాయన్న బీఆర్ఎస్ ఆరోపణలను మంత్రి పొంగులేటి తిప్పికొట్టారు. వాస్తవ పరిస్థితిని గణాంకాలే చెబుతున్నాయని స్పష్టం చేశారు. మరోవైపు 22ఏ నిషేధిత భూముల జాబితా విషయంలో మాత్రం రాజకీయ వాదోపవాదాలు కొనసాగాయి. భూముల రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ భూముల పరిరక్షణ, రియల్ ఎస్టేట్ రంగం, సామాన్యుల భూ హక్కులు వంటి అంశాలు ఈ వివాదంతో ముడిపడి ఉన్నాయి. దీంతో 22ఏ అంశం కేవలం రెవెన్యూ వ్యవహారంగా కాకుండా తెలంగాణ రాజకీయాల్లో కీలకమైన రాజకీయ అంశంగా మారింది. మరోవైపు తెలంగాణ శాసనసభ సాక్షిగా రాష్ట్రంలో నెలకున్న భూ సమస్యలు, 22ఏ నిబంధనలు , ధరణి అక్రమాలపై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ధరణి పోర్టల్ ను అడ్డుపెట్టుకుని గత పాలకులు లక్షలాది ఎకరాలను చెరబట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇప్పుడు అసెంబ్లీ సాక్షిగా వారి బండారం బయటపడుతుండటంతోనే సభ నుంచి తప్పించుకొని తిరుగుతున్నారని విమర్శించారు. పోరాడి సాధించుకున్న తెలంగాణను స్వప్రయోజనాల కోసం వాడుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లలో కేసీఆర్ కుటుంబం, వాళ్ల బంధువులు మాత్రమే బాగుపడ్డారని అన్నారు. అలాగే ధరణి తప్పిదాలతో వందల మంది రైతుల ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. తెలంగాణలోని దాదాపు 2.49 కోట్ల ఎకరాల భూమిని తమ సొంత ఆస్తిగా భావించి గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాలన సాగించిందని మంత్రి పొంగులేటి మండిపడ్డారు. ధరణి పోర్టల్ నిర్వహణను దివాలా తీసిన ఒక విదేశీ కంపెనీకి అప్పగించారని దుయ్యబట్టారు.

ధరణి పోర్టల్ పై ఉన్న నియంత్రణను దుర్వినియోగం చేస్తూ అర్ధరాత్రి సమయాల్లో రిజిస్ట్రేషన్లు చేశారని కీలక ఆరోపణలు చేశారు. ప్రజల ఆస్తులను పరిరక్షించడమే రెవెన్యూ సంస్కరణల ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. శాసనసభలో 22ఏ నిషేధిత భూముల అంశంపై జరిగిన స్వల్ప కాలిక చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి చట్టం ఆశామాషీగా తీసుకురాలేదని.. దాదాపు 18 రాష్ట్రాల్లోని అధికారులు అధ్యయనం చేశాక..ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించిన తర్వాతే భూ భారతికి రూపకల్పన చేశామని స్పష్టం చేశారు.

# ప్రపంచ పాలన మారాలని బ్రిక్స్ దేశాలు పిలుపు

ప్రధాని మోదీ ఈ డిక్లరేషన్‌పై ప్రకటన చేశారు. డిక్లరేషన్‌లోసుంకాలు, ఆంక్షలు, అంతర్జాతీయ సంస్థలపై పెత్తనం అంశంలో అమెరికా తీరునే తప్పుబట్టినా.. ఎక్కడ అమెరికా పేరును ప్రస్తావించలేదు. ఢిల్లీలోని భారత మండపంలో "న్యాయమైన పోటీ దిశగా సహకారాన్ని బలోపేతం చేయడం, పునరుత్పాదక ఇంధన మార్కెట్లలోనూ సహకారం" నేపథ్యంతో 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు నిర్వహిస్తున్నారు. ఏకపక్ష వాణిజ్య విధానాలపై నిరసన, బహుళధ్రువ ప్రపంచాన్ని బలోపేతం చేయడం, పరస్పర సహకారం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చలు జరిగాయి. . అనంతరం మొత్తం 45 పేజీల్లో 140 అంశాలతో కూడిన 'న్యూఢిల్లీ డిక్లరేషన్-2026'ను బ్రిక్స్ దేశాలు ఏకగ్రీవంగా ఆమోదించాయి. ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈ మధ్య పలు అంశాల్లో పేచీలు తలెత్తినా.. సుదీర్ఘ చర్చలు, భారత్ జోక్యంతో అన్ని దేశాలూ ఏకగ్రీవంగా ఆమోదించేందుకు అంగీకరించాయని అధికార వర్గాలు వెల్లడించాయి

### ప్రపంచ పాలన వ్యవస్థల్లో మార్పులు..

ఇప్పుడున్న అంతర్జాతీయ సంస్థలు ప్రస్తుత ప్రపంచ ఆర్థిక, జనాభా వాస్తవాలకు అనుగుణంగా లేవని.. ప్రపంచ పాలన వ్యవస్థలో మార్పులు అవసరమని బ్రిక్స్ దేశాలు స్పష్టం చేశాయి. ఐక్యరాజ్యసమితి, భద్రతా మండలి సహా అంతర్జాతీయ సంస్థల్లో అభివృద్ధి చెందుతున్న దేశాలకు మరింత ప్రాతినిధ్యం కల్పించాలని పేర్కొన్నాయి. భద్రతా మండలిలో సంస్కరణలు అవసరమని.. భారత్, బ్రెజిల్ సహా కీలక దేశాలకు మరింత ప్రాతినిధ్యం అవసరమని తెలిపాయి. డబ్ల్యూటీవో, ప్రపంచ బ్యాంకు, ఐఎంఎ?ఫలను పునర్వ్యవస్థీకరించాలని.. అభివృద్ధి చెందుతున్న దేశాలకు మరింత ప్రాతినిధ్యం కల్పించాలని కోరాయి. సభ్య దేశాల మధ్య పరస్పర గౌరవం, సమానత్వం, ఐక్యత, ఏకాభిప్రాయం వంటి సూత్రాలపై నిబద్ధతతో ఉంటామని బ్రిక్స్ డిక్లరేషన్ పేర్కొంది. బ్రిక్స్ ఆధ్వర్యంలోని 'న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఎన్‌డీబీ)' మరింత బలోపేతం చేయాలని సభ్య దేశాలు తీర్మానించాయి. కృత్రిమ మేధ, డిజిటల్ టెక్నాలజీలు, ఔషధాలు, ఆరోగ్య సాంకేతికతలు, ఆహార భద్రత అంశాల్లో మరింతగా సహకరించుకోవాలని.. బ్రిక్స్ దేశాల మధ్య ఈ అంశాల్లో అంతరాలను తగ్గించుకునే దిశగా చర్యలు చేపట్టాలని నిర్ణయించాయి.

# గణపతి మండపాలకు ధన్‌పాల్ ట్రస్టు సహకారం

**రెండు రోజులుగా ఉత్సవ నిర్వాహకులకు విరాళాల పంపిణీ**

**ఈ ఏడాది సుమారు 800 మండపాలకు సహకారం: ఎమ్మెల్యే ధన్‌పాల్**

**సంప్రదాయబద్ధంగా గణపతి ఉత్సవాలు నిర్వహించాలని పిలుపు**



నిజామాబాద్, సెప్టెంబర్ 12 (నారద): గణపతి ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పిలుపునిచ్చారు. ధన్‌పాల్ లక్ష్మీబాయి విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గణపతి మండపాలకు అందిస్తున్న ఆర్థిక సహాయం కార్యక్రమం రెండో రోజు శనివారం కొనసాగింది.

నగరంలోని మార్వాడిగల్లిలో గల కార్యాలయంలో వినాయక ఉత్సవ నిర్వాహకులకు ఎమ్మెల్యే ధన్‌పాల్ తన వంతు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తమ ట్రస్టు ద్వారా గణపతి మండపాలకు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది 725 మండపాలకు సహాయం అందించామని, భగవంతుడి ఆశీర్వాదంతో ఈ ఏడాది



సుమారు 800 మండపాలకు తమ వంతు సహకారం అందించనున్నట్లు వెల్లడించారు. వినాయకుడు కేవలం ఒక పండుగకు సంబంధించిన దేవుడు మాత్రమే కాదని, సంస్కృతి, సనాతన ధర్మం, ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. వినాయకుడిని భక్తిశ్రద్ధలతో పూజిస్తే విఘ్నాలు తొలగి శుభాలు కలుగుతాయని అన్నారు.

గణపతి ఉత్సవాల ద్వారా ప్రజల మధ్య సామూహిక ఐక్యత మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి మండపం వద్ద బాలగంగాధర్ తిలక్ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలని ఉత్సవ నిర్వాహకులకు సూచించారు.

ఆదివారం సాయంత్రం 5 గంటలకు కిసాన్ షాపింగ్ మాల్ వద్ద మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్లు, నాయకులు, గణపతి ఉత్సవ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా మరో వారం రోజుల పాటు వర్షాలు



హైదారాబాద్, సెప్టెంబర్ 12 తెలంగాణలో వర్షాల ఉద్ధృతి ఇప్పట్లో తగ్గే సూచనలు కనిపించడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా మరో వారం రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రానున్న 24 గంటల్లో పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంటూ హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా ములుగు, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, ఆదిలాబాద్, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లోనూ భారీ వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయి. వీటితో పాటు నల్గొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. హైదరాబాద్ నగరంలోనూ మోస్తరు వర్షాలు పడే సూచనలు ఉన్నాయి. వర్షాల నేపథ్యంలో ఉష్ణోగ్రతలు తగ్గడం, గాలిలో తేమ శాతం పెరగడం వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని రాష్ట్ర ప్రజారోగ్య శాఖ హెచ్చరించింది. ప్రధానంగా దోమలు, కలుషిత నీరు, గాలి ద్వారా వ్యాపించే అంటువ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. దోమతెరలు వాడటం, నివాస పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడటం, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగడం వంటి ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరింది. ఎవరికైనా ఫ్లూ లక్షణాలు కనిపిస్తే జాప్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని అధికారులు స్పష్టం చేశారు.

# 29 ఏళ్ల తర్వాత.. మైక్రోసాఫ్ట్‌ను వీడుతున్న కమ్యూనికేషన్స్ ఆఫీసర్

లాస్ ఏంజిల్స్: మైక్రోసాఫ్ట్ కంపెనీలో మూడు దశాబ్దాలుగా సేవలు అందించిన చీఫ్ కమ్యూనికేషన్స్ ఆఫీసర్ ఫ్రాంక్ షా(ఖీతీఝఅ వాష్ఝు) తన ఉద్యోగాన్ని వీడనున్నారు. తన నిర్ణయం గురించి ఆయన ఉద్యోగులకు ఇంటర్నల్ మెమో ద్వారా వెల్లడించారు. లింకిడిన్‌లో ఓ నోట్ షేర్ చేశారు. ఇక ఉద్యోగాన్ని వీడి, జీవితంలో కొత్త అన్వేషణ ప్రారంభించాలనుకుంటున్నట్లు ఆయన చెప్పారు. 29 ఏళ్లుగా ఆయన మైక్రోసాఫ్ట్‌లో వివిధ హోదాల్లో పని చేశారు. కంపెనీకి చెందిన పీఆర్ ఏజెన్సీ వాగ్నర్ ఎడ్‌స్ట్రామ్‌లో ఆయన కొన్నేళ్లుగా చేశారు. అయితే 17 ఏళ్లుగా మాత్రం ఆయన మైక్రోసాఫ్ట్ చీఫ్ కమ్యూనికేషన్ ఆఫీసర్‌గా చేస్తున్నారు. ఇక ఈ ఏడాది చివరి వరకు ఆయన ఉ ద ో ్య గ ం ల ో న ె ా గ ్ న ు ా ం ్ ం. ఆ పోస్టుకు కొత్తగా ఎవరు వస్తారన్న విషయాన్ని మాత్రం ఆయన వెల్లడించలేదు. 1997 నుంచి మైక్రోసాఫ్ట్‌లో ఫ్రాంక్ షా స్ట్రాటజిక్ మెసేజింగ్ ఆఫీసర్‌గా చేశారు. విండోస్ లాంచింగ్ సమయాల్లో ఆయన పబ్లిక్ కమ్యూనికేషన్ స్ట్రాటజీ చూసుకున్నారు. మార్కెటింగ్ చీఫ్ తకేసితో తన నిర్ణయాన్ని పంచుకున్నట్లు చెప్పారు. కమ్యూనికేషన్ టీమ్‌లో అనేక మంది ట్యాలెంట్ ఉద్యోగులతో పనిచేసినట్లు ఆయన తెలిపారు.

# బాబుతో నడ్డా మర్యాదపూర్వక భేటీ

అమరావతి, సెప్టెంబర్ 12 ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. శనివారం ఉదయం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో ఈ సమావేశం జరిగింది. రాష్ట్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు అమరావతికి విచ్చేసిన కేంద్ర మంత్రి నడ్డాను సీఎం చంద్రబాబు తన నివాసానికి ఆహ్వానించారు. సీఎం నివాసానికి చేరుకున్న జేపీ నడ్డాకు చంద్రబాబు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ఇరువురు నేతలు కొద్దిసేపు ముచ్చటించారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై సాధారణంగా చర్చించుకున్నట్లు తెలుస్తోంది. అయితే, ఇది పూర్తిగా మర్యాదపూర్వక సమావేశమేనని అధికార వర్గాలు స్పష్టం చేశాయి. కేంద్రంలో, రాష్ట్రంలో మిత్రపక్ష ప్రభుత్వాలు కొలువుదీరిన నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర మంత్రుల మధ్య ఇలాంటి సమావేశాలు జరగడం సాధారణమే. ముఖ్యమంత్రి ఆహ్వానం మేరకు జేపీ నడ్డా ఆయన నివాసానికి వెళ్లారు. అధికారిక కార్యక్రమాల నిమిత్తం రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి, ముఖ్యమంత్రితో భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. అంతకుముందు, విజయవాడలో శనివారం జరిగిన కార్యక్రమంలో జేపీ నడ్డా, చంద్రబాబు కలిసి రాష్ట్రవ్యాప్తంగా రూ.249 కోట్ల విలువైన 10 క్రిటికల్ కేర్ బ్లాకులు, 12 ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబ్‌లను వర్చువల్‌గా ప్రారంభించారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతోనే ఇలాంటి అభివృద్ధి సాధ్యమని ఈ సందర్భంగా నేతలు స్పష్టం చేశారు.

## పౌల్ట్రీ రంగానికి కొత్త ఊపిరి

అమరావతి, సెప్టెంబర్ 12 : రాష్ట్రంలో పౌల్ట్రీ రంగాన్ని బలోపేతం చేసి, పౌల్ట్రీ రైతులకు పూర్తి స్థాయి అండగా నిలిచేందుకు 'ఏపీ పౌల్ట్రీ డెవలప్‌మెంట్ పాలసీ 2026--29'కు ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. విజయవాడలో పౌల్ట్రీ అసోసియేషన్ ప్రతినిధులు ఆయనను కలిసిన సందర్భంగా మాట్లాడిన మంత్రి... ఈ రంగం అభివృద్ధికి రూ.657 కోట్ల భారీ ఆర్థిక ప్యాకేజీని ప్రకటించామని వెల్లడించారు. ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం, ఆధునిక సాంకేతికతను ప్రోత్సహించడం, ఉపాధి అవకాశాలను పెంచడమే ఈ పాలసీ ప్రధాన లక్ష్యమని చెప్పారు. రూ.3.75, ఫీడ్ మిక్సింగ్ యూనిట్లకు రూ.4.75 టారిఫ్ క్రమబద్ధీకరణ కల్పించామన్నారు.

# రాష్ట్రంలో మరో మూడు రోజులపాటు వర్షాలు..

## హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి



హైదరాబాద్ , రాష్ట్రంలో వర్షాలు కొనసాగుతున్నాయని, ఇప్పట్లో ఈ వర్షాలు తగ్గే సూచనలు కనిపించడం లేదని, రాష్ట్రవ్యాప్తంగా మరో వారం రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రానున్న 24 గంటల్లో పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంటూ హెచ్చరికలు జారీచేసింది. ముఖ్యంగా ములుగు, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, ఆదిలాబాద్, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లోనూ భారీ వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయని వాతావరణ కేంద్రం తెలిపింది. వీటితోపాటు నల్గొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నది. హైదరాబాద్ నగరంలోనూ మోస్తరు వర్షాలు పడే సూచనలు ఉన్నాయని తెలిపింది. వర్షాల నేపథ్యంలో ఉష్ణోగ్రతలు తగ్గడం, గాలిలో తేమ శాతం పెరగడం వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని రాష్ట్ర ప్రజారోగ్య శాఖ హెచ్చరించింది.

ప్రధానంగా దోమలు, కలుషిత నీరు, గాలి ద్వారా వ్యాపించే అంటువ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. దోమతెరలు వాడటం, నివాస పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడటం, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగడం వంటి ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరింది. ఎవరికైనా ఫ్లూ లక్షణాలు కనిపిస్తే జాప్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని అధికారులు స్పష్టం చేశారు.

# ఏడేళ్ల తర్వాత భారత్‌కు వచ్చిన చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్..!



: చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ భారత్‌కు చేరుకున్నారు. 18వ బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు శనివారం న్యూఢిల్లీకి వచ్చిన ఆయన.. దాదాపు ఏడేళ్ల తర్వాత భారత్‌లో అడుగుపెట్టారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, జిన్‌పింగ్ మధ్య ద్వైపాక్షిక భేటీ జరగనుంది. బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో ఇరు దేశాల సంబంధాలపై కీలక చర్చలు జరిగే అవకాశం ఉంది. జిన్‌పింగ్‌తోపాటు చైనా కమ్యూనిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో స్టాండింగ్ కమిటీ సభ్యుడు, పార్టీ కేంద్ర కార్యాలయ డైరెక్టర్ కై కీ, పొలిట్‌బ్యూరో సభ్యుడు, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ భారత్‌కు వచ్చారు. ఈ విషయాన్ని చైనాలో భారత రాయబారి షూ ఫెయిహోంగ్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. 2020లో గల్వాన్ ఘర్షణల తర్వాత భారత్–చైనా సంబంధాల్లో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. సరిహద్దు ప్రాంతాల్లో శాంతి కొనసాగడం ద్వైపాక్షిక సంబంధాల అభివృద్ధికి కీలకమని భారత్ పదేపదే స్పష్టంచేస్తోంది. ఈ నేపథ్యంలో జిన్‌పింగ్ పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది. ఇటీవల బిష్కెక్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సులో మోదీ, జిన్‌పింగ్ స్వల్పంగా మాట్లాడుకున్నారు. ఇప్పుడు న్యూఢిల్లీలో బ్రిక్స్ సదస్సు సందర్భంగా ఇరువురు నేతలు విస్తృతంగా చర్చించనున్నారు. భారత్, చైనా మధ్య ద్వైపాక్షిక భేటీకి ఏర్పాట్లు జరుగుతున్నాయని చైనా రాయబారి షూ ఫెయిహోంగ్ తెలిపారు. మోదీ, జిన్‌పింగ్ వరుసగా మూడో ఏడాది సమావేశం కానున్నారని ఆయన చెప్పారు. గతంలో రష్యాలోని కజాన్, చైనాలోని టియాంజిన్‌లో ఇరువురు నేతలు భేటీ అయ్యారని గుర్తుచేశారు. రెండు దేశాల మధ్య సంబంధాలను వ్యూహాత్మకంగా, దీర్ఘకాలిక దృష్టితో ముందుకు తీసుకెళ్లేందుకు చైనా కృషి చేస్తుందని తెలిపారు.

# కన్నతల్లి మరణవార్త తట్టుకోలేక కొడుకు ఆత్మహత్య..

**మెదక్ జిల్లా పెద్దశంకరంపేట విషాద ఘటన**

హైదారాబాద్, సెప్టెంబర్ 12 అమ్మంటే ప్రేమ.. అమ్మంటే ప్రాణం.. కానీ ఆ కన్నతల్లే లేదనే నిజాన్ని ఆ 19 ఏళ్ల కుమారుడు తట్టుకోలేకపోయాడు. తల్లి లేని లోకంలో తాను ఉండలేనంటూ.. అమ్మ వెళ్లిన దారినే తాను ఎంచుకున్నాడు! మెదక్ జిల్లాలో ఒకే కుటుంబంలో గంటల వ్యవధిలో జరిగిన ఈ జంట ఆత్మహత్యలు స్థానికులను కన్నీళ్లు పెట్టిస్తున్నాయి. మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండల పరిధిలోని మక్తా లక్ష్మపూర్ గ్రామానికి చెందిన బేతమ్మ (45), ఆమె భర్త బతుకుదెరువు కోసం కొన్నేళ్ల క్రితం హైదరాబాద్‌కు వలస వెళ్లారు. అక్కడే నివాసముంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కాగా, ఇటీవల హైదరాబాద్‌లోని వారి నివాసంలో భార్యాభర్తల మధ్య స్వల్ప గొడవ జరిగింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన బేతమ్మ, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. హైదరాబాద్‌లో తల్లి బేతమ్మ ఆత్మహత్య చేసుకున్న విషయం సొంత ఊరిలో ఉన్న ఆమె కుమారుడు ప్రవీణ్ (19)కు తెలిసింది. ప్రాణంగా ప్రేమించే కన్నతల్లి ఇకలేదనే విషయాన్ని ఆ యువకుడు తట్టుకోలేకపోయాడు. తీవ్రమైన మానసిక వేదనకు లోనైన ప్రవీణ్, క్షణికావేశంలో తీవ్ర నిర్ణయం తీసుకున్నాడు. వెంటనే కొలపల్లి గ్రామ శివారులోకి వెళ్లి, అక్కడ ఉన్న ఒక చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఒకే కుటుంబంలో తల్లి, కొడుకు ఇద్దరూ గంటల వ్యవధిలోనే ఆత్మహత్యలకు పాల్పడటంతో మక్తా లక్ష్మపూర్ మరియు కొలపల్లి గ్రామాల్లో తీవ్ర శోకసంద్రం అలుముకుంది. మరణంలోనూ వీడని ఆ తల్లీకొడుకుల బంధం గురించి తలచుకుని గ్రామస్థులు కన్నీరుమున్నీరవుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని పూర్తిస్థాయిలో దర్యాప్తు జరుపుతున్నారు.

# బీసీ రక్షణ చట్టం తీసుకొస్తున్నాం

- **జగన్ ప్రభుత్వం బీసీలకు ద్రోహం చేసింది**
- **ఆంధ్రప్రదేశ్ మంత్రి సవిత కీలక వ్యాఖ్యలు**
- **'బీసీ రక్షణ చట్టం' అవగాహన సదస్సు**

అమరావతి, సెప్టెంబర్ 12 బీసీల ఆత్మగౌరవ జీవనమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని మంత్రి సవిత స్పష్టం చేశారు. విజయవాడ సమీపంలోన ఉన్న గొల్లపూడి బీసీ భవన్‌లో నిర్వహించిన 'బీసీ రక్షణ చట్టం' అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీసీలకు ఆర్థిక, రాజకీయ, సామాజిక గుర్తింపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోనే సాధ్యపడుతుందని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో 'బీసీ రక్షణ చట్టం' తీసుకొస్తున్నామని మంత్రి వెల్లడించారు.

బీసీలను కులం లేదా వృత్తుల పేరుతో దూషించినా, సంఘ బహిష్కరణకు గురిచేసినా కఠిన శిక్షలు పడేలా జిల్లాల్లో ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేసి, 2 నెలల్లోనే విచారణ పూర్తిచేసేలా పక్కా నిబంధనలు రూపొందించామని స్పష్టం చేశారు. ఈ చట్టం కోర్టులలో బలంగా నిలబడేలా 156 బీసీ కార్పొరేషన్ల చైర్మన్లు, ప్రజాప్రతినిధుల సలహాలు తీసుకున్నామన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలి

**ఓటర్లకు నోటీసుల జారీలో జాప్యం వద్దు**

**జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**



హనుమకొండ, సెప్టెంబర్ 12 ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పూర్తి పారదర్శకతతో, నిబంధనలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు.

శనివారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని కనకదుర్గ కాలనీ, వడ్డేపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సుధానగర్ బాలుర వసతి గృహంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ సందర్శించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో మ్యాపింగ్ కాని, అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్ల కోసం ఏర్పాటు చేసిన విచారణ కేంద్రాలతో పాటు కొత్త ఓటర్ల నమోదు, అభ్యంతరాల స్వీకరణ కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక క్యాంపెయిన్‌ను పరిశీలించారు.

పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవల్ అధికారులు చేపడుతున్న ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్.. మ్యాపింగ్ కాని, అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు నోటీసుల జారీ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు నోటీసులను ఎలాంటి జాప్యం లేకుండా సత్వరమే అందించాలని బీఎల్ఓలను ఆదేశించారు. సెలవు రోజుల్లో ఉద్యోగులు, వ్యాపారులు తమ ఇళ్ల వద్ద అందుబాటులో ఉండే అవకాశం ఎక్కువగా ఉన్నందున బీఎల్ఓలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

మ్యాపింగ్ కాని ఓటర్లు, అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సమర్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. వివరాల్లో చిన్నపాటి లోపాలు లేదా



వ్యత్యాసాలు ఉన్న సందర్భాల్లో సంబంధిత ధ్రువీకరణ పత్రాలను యాప్‌లో అప్‌లోడ్ చేసి, నిబంధనల ప్రకారం విచారణ (హియరింగ్) ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.

ఎస్ఐఆర్‌లో ప్రతి దశను ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేయడంతో పాటు ఓటర్లకు అవసరమైన సమాచారం, సేవలు సులభంగా అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

అనంతరం ఏఈఆర్వోలు, బీఎల్ఓలు యాప్ ద్వారా నిర్వహిస్తున్న డాక్యుమెంట్ అప్‌లోడ్, హియరింగ్ ప్రక్రియను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి పలు సూచనలు చేశారు.

ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఈఆర్వో, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, హనుమకొండ ఏఈఆర్వో, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, బీఎల్ఓలు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సమక్షంలో దళిత ఐపీఎస్‌కు అవమానం..

## గణేశ్ ఉత్సవాల సమీక్షలో వెలుగుచూసిన అంటరానితనం!!

హైదరాబాద్, సెప్టెంబర్ 12 గణేశ్ ఉత్సవాలపై సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం తీవ్ర కులవివక్ష ఆరోపణలకు వేదికైంది. రాష్ట్రంలో అత్యంత సీనియర్ దళిత ఐపీఎస్ అధికారి, లా అండ్ ఆర్డర్ డీజీ మహేశ్ భగవత్‌ను నిబంధనలకు విరుద్ధంగా వెనుక బెంచీకి పరిమితం చేసి అవమానించారంటూ రాజకీయ, ఉద్యోగ వర్గాల్లో పెనుదుమారం రేగుతున్నది. శాసనమండలి కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ఈ సమీక్షకు డీజీపీ హాజరుకాలేదు. ఇలాంటి సమయంలో ప్రొటోకాల్ ప్రకారం డీజీపీ తర్వాతి హోదాలో ఉన్న అత్యున్నత స్థాయి పోలీస్ అధికారి, ముఖ్యమంత్రి పకనే లేదా ప్రధాన టేబుల్‌పై ముందువరుసలో కూర్చోవాలి. కానీ, ఆయన కంటే ఎంతో జూనియర్లైన రెడ్డి సామాజికవర్గానికి చెందిన అధికారులతోపాటు, ప్రమోటీ ఐపీఎస్‌లను దర్జాగా ముందు సీట్లలో కూర్చోబెట్టి, 1995 బ్యాచ్ సీనియర్ దళిత అధికారిని వెనుక వరుసకు నెట్టివేశారు.ప్రపంచ పటాలు పరిశీలించండి



మాటల్లో రాజ్యాంగం.. చేతల్లో కుల పెత్తనం!

వినాయక చవితి ఏర్పాట్ల సమీక్ష కావడం వల్లే దళిత అధికారిని ముందువరుసలో కూర్చోబెట్టడానికి పాలకులు ఇష్టపడలేదని, కావాలనే దూరంగా ఉంచారని సోషల్ మీడియాలో, అధికార వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది. పండుగ నిర్వహణ పేరిట అత్యున్నత అధికారిపైనే వివక్ష ప్రదర్శించడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని విమర్శకులు మండిపడుతున్నారు. ఇటీవల అసెంబ్లీ వేదికగా దళిత ప్రస్తావన తెచ్చి గందరగోళం సృష్టించడం, ఎమ్మెల్సీలపై సస్పెన్షన్లు, కేసులు బనాయించిన ప్రభుత్వం.. తీరా అధికారిక సమీక్షల్లోకి వచ్చేసరికి దళిత ఉన్నతాధికారులకు వెనుక బెంచీలు కేటాయిస్తూ నిజస్వరూపాన్ని బయటపెట్టుకున్నదని దళిత సంఘాలు, ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి. సాక్షాత్తు శాంతిభద్రతల అధిపతిగా ఉన్న దళిత ఐపీఎస్‌ను కులం ప్రాతిపదికన అవమానించడం ప్రభుత్వ నైజాన్ని బయటపెట్టిందని మండిపడుతున్నాయి.

# డీజే సౌండ్‌పై బాల్కొండ పోలీసుల కేసు

**శబ్ద కాలుష్యం, పబ్లిక్ న్యూసెన్స్‌కు కారణమైన సౌండ్ సిస్టమ్ సీజ్**

**డీజేలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదు: పోలీస్ కమిషనర్ సాయి చైతన్య**




నిజామాబాద్, సెప్టెంబర్ 12: గణేష్ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో నిబంధనలకు విరుద్ధంగా అధిక శబ్దంతో డీజే సౌండ్ సిస్టమ్ వినియోగించిన ఘటనపై బాల్కొండ పోలీసులు కేసు నమోదు చేశారు. శబ్ద కాలుష్యం, పబ్లిక్ న్యూసెన్స్‌కు కారణమైన డీజే సౌండ్ సిస్టమ్‌ను సీజ్ చేశారు.

బాల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని చిట్టాపూర్ గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి సుమారు 12 గంటల సమయంలో గణేష్ ఆగమన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండప నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా డీజే సౌండ్ సిస్టమ్‌ను వినియోగిస్తూ అధిక శబ్దం చేసినట్లు పోలీసులు గుర్తించారు. వెంటనే స్పందించిన పోలీసులు సంబంధిత నిర్వాహకులపై కేసు నమోదు చేసి, డీజే సౌండ్ సిస్టమ్‌ను సీజ్ చేశారు. ఘటనపై దర్యాప్తు చేపట్టారు.ఈ సందర్భంగా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐపీఎస్ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. ప్రజలకు ఇబ్బంది కలిగించేలా అధిక శబ్దంతో డీజేలను వినియోగించడం, శబ్ద కాలుష్యం, పబ్లిక్ న్యూసెన్స్‌కు కారణమయ్యే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించేది లేదని స్పష్టం చేశారు.గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా పోలీసు శాఖకు సహకరించాలని కమిషనర్ కోరారు.

# కోర్ అర్బన్ రీజియన్ 2026 బిల్లు

## హైదరాబాద్?కు క్యూర్-2026 చట్టం- ఇక బిల్లు ఆమోదమే తరువాయి

హైదారాబాద్, సెప్టెంబర్ 12(ఆర్ఎన్ఏ): హైదరాబాద్ మహా నగరంలో వేర్వేరు సంస్థలు, వ్యవస్థలతో అస్తవ్యస్తంగా మారిన పరిపాలనను చక్కదిద్దడమే లక్ష్యంగా క్యూర్(కోర్ అర్బన్ రీజియన్)-2026 బిల్లును ప్రభుత్వం శుక్రవారం శాసనసభలో ప్రవేశపెట్టింది. ఒకే నగరం, ఒకే పరిపాలన, ఒకే చట్టం నినాదంతో ఈ బిల్లు రూపుదిద్దుకుంది. జీహెచ్ఎంసీ-1955 చట్టం స్థానంలో ప్రభుత్వం ఈ క్యూర్? బిల్లు-2026ను ప్రతిపాదించింది. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న జీహెచ్ఎంసీ, ఎంఎంసీ, సీఎంసీలకు ఈ చట్టం వర్తిస్తుంది. ఇందులో ఐదు భాగాలు, 43 చాప్టర్లు, 319 సెక్షన్లు, 9 షెడ్యూళ్లు ఉన్నాయి. సీఎం ఛైర్మన్‌గా క్యూర్ పరిధికి అత్యున్నత పరిపాలన మండలి, కార్యనిర్వాహక కమిటీ ఛైర్మన్‌గా పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి, మరో పది రకాల కమిటీలు ఈ చట్టంలో ఉంటాయి. జీహెచ్ఎంసీ చట్టంలో మాదిరి పరిపాలనలో నగర పాలక సంస్థనే పరిమితం చేయకుండా పోలీసు, హైడ్రా, జలమండలి వంటి ఇతర శాఖలను ఇందులో భాగస్వామ్యం చేసింది. అక్రమ నిర్మాణాల కట్టడికి జరిమానా, కూల్చివేత, సీజ్ చేయడం, సౌకర్యాల నిలిపివేత అనే నాలుగు రకాల చర్యలు ఇందులో ఉంటాయి. సెక్షన్ 94 ప్రకారం అనుమతిలేని భవన నిర్మాణాలు ఉంటే ఆస్తిపన్నుపై 100 శాతం నుంచి 300 శాతం జరిమానా పడుతుంది. భవనం వినియోగాన్ని మార్చినా ఫైన్ విధిస్తారు. అనుమతి లేని భవనాలకు జీహెచ్?ఎంసీ కమిషనర్ నోటీసు ఇచ్చిన 15 రోజుల్లో చర్యలు ఉంటాయి. అనుమతిలేని భవనాన్ని యజమాని స్వయంగా కూల్చుకోవాల్సి ఉంటుంది. లేదంటే బల్దియా కూల్చి ఖర్చును ఆస్తిపన్నులో జమచేస్తుంది. ప్రజల భద్రత దృష్ట్యా మున్సిపల్ అధికారులు నోటీసు లేకుండానే భవనాన్ని సీజ్ చేసే అధికారం ఉంది. నివాసయోగ్యపత్రం లేకపోతే భవనానికి కరెంటు, తాగునీరు, మురుగునీటి కనెక్షన్లు మంజూరు చేయకూడదు. అక్రమ నిర్మాణాల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని, రిజిస్ట్రేషన్ల చట్టంలోని సెక్షన్ 22ఏ(1)(ఏ) కింద నిషేధిత జాబితాలో చేర్చాలని ముసాయిదా బిల్లు చెబుతోంది. ఆయా కేసుల్లో ప్రజలు బాధితులుగా మారితే జీహెచ్?ఎంసీ కమిషనర్, జిల్లా కలెక్టర్ స్థాయిలో విచారణ జరిపి న్యాయం చేస్తారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నిర్ణయాలు, నోటీసులను 30 రోజుల్లో ప్రజలు సవాల్? చేయవచ్చు. ప్రభుత్వం క్యూర్ అప్పిలేట్ అథారిటీని కూడా ఏర్పాటు చేస్తుంది. ఛైర్‌పర్సన్, ఇద్దరి నుంచి నలుగురు పూర్తిస్థాయి సభ్యులతో సివిల్ కోర్టు అధికారాలతో ఈ అథారిటీ విధులు నిర్వహిస్తుంది. సభ్యులను ప్రభుత్వం, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శితో కూడిన సెలక్షన్ కమిటీ నియమిస్తుంది. క్యూర్ పరిధిలోని 3 కార్పొరేషన్లకు ఒకే వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్ ద్వారా పౌర సేవలను అందించాలని అన్నిరకాల పర్మిషన్లు, పన్ను, రుసుముల చెల్లింపునకు సదుపాయం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. భవిష్యత్తులో ఇతర ప్రభుత్వ శాఖల రుసుముల చెల్లింపు సదుపాయాన్ని కూడా క్యూర్ ఆన్?లైన్ పోర్టల్‌లో చేర్చాలన్నది ప్రతిపాదన. హైదరాబాద్?లోని అన్ని భవనాలకు ప్రాపర్టీ ఐడెంటిటీ కోడ్, అపార్ట్‌మెంట్ల విషయంలో ఫ్లాట్లకు సబ్ ఐడెంటిటీ కోడ్‌ను ఇవ్వాలన్నది బిల్లులోని ప్రతిపాదన. ఆయా గుర్తింపు సంఖ్యతో ప్రజలు తమ ఆస్తి వివరాలు, నీటి బిల్లు, దానికి సంబంధించిన పన్ను, కరెంటు బిల్లు, ఇతరత్రా ఛార్జీలను చెల్లించుకునే వెసులుబాటు కల్పిస్తారు. క్యూర్ బిల్లుపై ప్రభుత్వం ఈ ఏడాది జులై 4వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ప్రజల నుంచి అభ్యంతరాలు, అభిప్రాయాలు స్వీకరించింది.

# భారీగా పెరిగిన ఎంబీబీఎస్ సీట్లు

హైదారాబాద్, సెప్టెంబర్ 12 తెలంగాణ వైద్య విద్యలో మరో కీలక ముందడుగు పడింది. రాష్ట్రంలో కొత్తగా 1,010 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. దీంతో 2026--27 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని 66 మెడికల్ కాలేజీల్లో మొత్తం ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 10,450కి చేరింది. దేశవ్యాప్తంగా మెడికల్ సీట్ల వివరాలతో మెడికల్ అసెస్‌మెంట్ అండ్ రేటింగ్ బోర్డు శుక్రవారం విడుదల చేసిన సీట్ మ్యాట్రిక్స్‌లో ఈ వివరాలు వెల్లడయ్యాయి. తాజా పెంపుతో అత్యధిక ఎంబీబీఎస్ సీట్లు ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ ఐదో స్థానానికి చేరింది. రాష్ట్రంలో ప్రస్తుతం 36 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 4,400 సీట్లు ఉన్నాయి. వీటిలో 4,290 సీట్లు గత సీట్లకు రెన్యువల్ కాగా.. కొత్తగా మరో 110 సీట్లు పెరిగాయి. మహబూబ్‌నగర్, సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 25 చొప్పున, నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీ, ఆదిలాబాద్ రిమ్స్‌లో 30 చొప్పున సీట్లు పెరిగాయి. రాష్ట్రంలోని 30 ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో మొత్తం 6,050 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో 5,150 సీట్లు రెన్యువల్ కాగ.., కొత్తగా 900 సీట్లు చేరాయి. కొత్తగా ఏర్పాటైన రాజరాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో 150 సీట్లు కేటాయించారు. మిగిలిన సీట్లు ఇప్పటికే ఉన్న పలు ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో సీట్ల పెంపు ద్వారా అందుబాటులోకి వచ్చాయి. కొత్త సీట్లతో రాష్ట్రంలో వైద్య విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు మరిన్ని అవకాశాలు లభించనున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీల సంఖ్య, సీట్ల సామర్థ్యం పెరుగుతున్న నేపథ్యంలో వైద్య విద్యను జిల్లాల స్థాయికి విస్తరించే ప్రయత్నాలకు ఇది మరింత ఊతమివ్వనుంది. ఎయిమ్స్, జిప్‌మర్ వంటి జాతీయ ప్రాధాన్యం ఉన్న సంస్థలను మినహాయిస్తే దేశవ్యాప్తంగా 836 మెడికల్ కాలేజీల్లో 1,40,214 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. ఇందులో సీట్లు ఉన్నాయి. కొత్త కాలేజీలు, సీట్ల పెంపు ద్వారా ఈ ఏడాది దేశవ్యాప్తంగా 13,186 సీట్లు అదనంగా అందుబాటులోకి వచ్చాయి.

# నేడు ఆఫ్ఘనిస్తాన్ తో టీమిండియా టీ20

**ఢిల్లీ అరుణ్ జైట్లీ స్టేడియం మ్యాచ్**
**సవాల్‌గా మారిన తుది జట్టు ఎంపిక**




శ్రేయాస్ అయ్యర్ సారథ్యంలోని భారత టీ20 జట్టు ఇటీవలే జింబాబ్వే పర్యటనను దిగ్విజయంగా ముగించుకుంది. ఈ సిరీస్ ను 3-0 తేడాతో కైవసం చేసుకుంది. అంతకుముందు ఐర్లాండ్, ఇంగ్లాండ్ లల్లో చవి చూసిన పరిపూర్ణ ఓటముల గాయాన్ని జింబాబ్వే సిరీస్ కొంతవరకు నయం చేయగలిగింది. ఇక.. మూడు టీ20 మ్యాచ్ ల సిరీస్ ఆడబోతోంది. ఆఫ్ఘనిస్తాన్ తో తలపడబోతోంది. ఈ మూడు మ్యాచ్ లకు ఢిల్లీ అరుణ్ జైట్లీ స్టేడియం ఆతిథ్యాన్ని ఇస్తోంది. అన్ని మ్యాచ్‌లు రాత్రి 7:30 గంటలకు ప్రారంభమౌతాయి. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో బరిలోకి దిగుతున్న టీమిండియా.. జింబాబ్వేపై సాధించిన విజయ పరంపరను కొనసాగించాలనే పట్టుదలతో ఉంది. తుది జట్టును ఎంపిక చేయడం పెద్ద సవా వాల్‌గా మారింది. స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ జట్టులోకి తిరిగి రావడంతో ఈక్వేషన్లు మారాయి. జింబాబ్వే పర్యటనకు దూరమైన శాంసన్ ఇప్పటివరకు ఆడిన 14 మ్యాచ్‌ల్లో 180.99 స్ట్రైక్ రేట్‌తో ఏకంగా 400 పరుగులు సాధించాడు. ఇందులో మూడు అర్ధ సెంచరీలు ఉన్నాయి. టీమిండియా ఓపెనింగ్ స్థానం కోసం గట్టి పోటీ నెలకొంది. జింబాబ్వే సిరీస్‌లో వరుసగా రెండు హాఫ్ సెంచరీలు సాధించి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అందుకున్న వైభవ్ సూర్యవంశీ వైపే మేనేజ్‌మెంట్ మొగ్గు చూపే అవకాశం ఉంది. మరో ఓపెనర్ అభిషేక్ శర్మ ప్రస్తుత ఫామ్ ఆందోళన కలిగిస్తోంది. గత మూడు మ్యాచ్‌ల్లో అతను కేవలం 11 పరుగులు మాత్రమే చేశాడు. మొదటి మ్యాచ్‌లో అభిషేక్ రాణించకపోతే, మిగిలిన రెండింటికీ సంజూ శాంసన్‌ను ఓపెనర్‌గా పంపే అవకాశం ఉంది. వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ కూడా ఓపెనర్ రేసులో ఉన్నాడు. దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్ జోన్‌పై 270 పరుగుల రికార్డు ఇన్నింగ్స్‌తో ఇషాన్ తన ఫామ్‌ను నిరూపించుకున్నాడు. దీంతో అతను నాలుగో స్థానంలో ఆడే అవకాశాలు ఉన్నాయి. ఇక మిడిల్ ఆర్డర్‌లో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, వైస్ కెప్టెన్ తిలక్ వర్మ జట్టుకు వెన్నెముకగా నిలవనున్నారు. ఆల్‌రౌండర్ కోటాలో ఎవరిని ఎంపిక చేయాలనే దానిపై తర్జన భర్జన జరుగుతోంది. శివమ్ దూబే, నితీష్ కుమార్ రెడ్డిల్లో ఒకరికి అవకాశం దక్కొచ్చు. ఎవరిని ఆడిస్తారనేది పిచ్ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. బ్యాటింగ్ డెప్త్ పెంచాలనుకుంటే దూబే వైపు, బౌలింగ్ ఆప్షన్ వైపు మొగ్గు చూపితే నితీష్ రెడ్డిని ఎంపిక చేసే అవకాశం ఉంది. బౌలింగ్ విభాగంలో మేనేజ్‌మెంట్ జస్‌ప్రీత్ బుమ్రా ఫిట్‌నెస్‌పై దృష్టి సారించింది. అర్ష్‌దీప్ సింగ్, స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్ ఈ మ్యాచ్ లో కీలకం కానున్నారు.



## బుమ్రాను ఎదుర్కొనేందుకు మా వద్ద వ్యూహాలు ఉన్నాయి

ధీమా వ్యక్తం చేసిన ఆఫ్ఘనిస్థాన్ కెప్టెన్ ఇబ్రహీం జద్రాన్

గాయం నుంచి కోలుకుని తిరిగి జట్టులోకి వస్తున్న టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాను ఎదుర్కోవడానికి తమ వద్ద ప్రత్యేక వ్యూహాలున్నాయని ఆఫ్ఘనిస్థాన్ కెప్టెన్ ఇబ్రహీం జద్రాన్ ధీమా వ్యక్తం చేశాడు. ఆదివారం (సెప్టెంబరు 13) అరుణ్ జైట్లీ స్టేడియంలో జరగనున్న తొలి టీ20కి ముందు జద్రాన్ మీడియాతో మాట్లాడాడు. బుమ్రా రాకతో భారత బౌలింగ్ విభాగం పటిష్ఠంగా మారినప్పటికీ, అతడిని సమర్థంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశాడు. "జస్ప్రీత్ బుమ్రా ప్రపంచంలోని అత్యుత్తమ బౌలర్లలో ఒకడు. నాకు ఇష్టమైన ఫాస్ట్ బౌలర్ కూడా అతడే. అయితే మేం ఏ విషయాన్నీ క్లిష్టంగా మార్చుకోం. అతడి కోసం మా వద్ద మంచి ప్రణాళిక ఉంది. అతడి బౌలింగ్‌ను ఎలా ఎదుర్కోవాలనే దానిపై స్పష్టమైన అవగాహనతో ఉన్నాం. బుమ్రాతో పాటు భారత జట్టుపైనా మెరుగైన ప్రదర్శన చేస్తామని ఆశిస్తున్నాం" అని జద్రాన్ తెలిపాడు. టీమిండియా యువ సంచలనం, లెఫ్ట్ హ్యాండ్ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీపై కూడా ప్రత్యేకంగా దృష్టి సారించామని జద్రాన్ వెల్లడించాడు. "ఐపీఎల్‌లో అతడిని ఎదుర్కొన్న మా జట్టు ఆటగాళ్ల నుంచి కీలక సమాచారం సేకరించాం. ఇప్పటికే అతడి వీడియోలను విశ్లేషించాం. సరైన సమయంలో సరైన ప్రణాళికలను అమలు చేయడంపైనే మా దృష్టి ఉంది" అని వివరించాడు. భారత్‌లో ఆడటం తమకు కొత్తేమీ కాదని, ఇక్కడి పరిస్థితులపై సంపూర్ణ అవగాహన ఉందని జద్రాన్ అన్నాడు. "గతంలో టీ20 ప్రపంచకప్, వన్డే ప్రపంచకప్‌లతో పాటు ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడాం. 2024లో బెంగళూరులో జరిగిన టీ20లో రెండు సూపర్ ఓవర్ల వరకు మ్యాచ్ సాగింది. భారత్‌పై మేం ఎప్పుడూ మెరుగైన క్రికెట్ ఆడాం. అయితే ఇప్పటివరకు వారిపై సిరీస్ గెలవలేదు. ఈసారి ఆ రికార్డును బద్దలు కొట్టి సిరీస్ గెలవడమే మా లక్ష్యం"

# చెన్నై యాజమాన్యం క్లారిటీతో తెరపడిన ఉత్కంఠ




చెన్నై సూపర్ కింగ్స్ ఫ్రాంచైజీలో ధోనీ వాటాలు కోరారనే ప్రచారం క్రీడా వర్గాల్లో పెద్ద ఎత్తున కలకలం రేపింది. ఈ ఊహాగానాలపై సీఎస్కే యాజమాన్యం అధికారికంగా స్పందిస్తూ స్పష్టత ఇచ్చింది. అదే సమయంలో కొత్త కోచ్ ఎంపిక, రాబోయే ఐపీఎల్ వ్యూహాలపై కూడా కీలక సమాచారం వెలువడింది. చెన్నై సూపర్ కింగ్స్ ఫ్రాంచైజీలో వాటాలను కొనుగోలు చేయడానికి ధోనీ ఆసక్తి చూపించారని, అయితే ఆయన పెట్టిన షరతులకు యాజమాన్యం అంగీకరించలేదని కొన్ని వార్తలు హల్‌చల్ చేశాయి. ఈ ప్రచారంపై సీఎస్కే పెద్ద అధికారి ఒకరు తీవ్రంగా స్పందించారు. ధోనీ నుంచి అలాంటి ప్రతిపాదన ఏది తమ వద్దకు రాలేదని, ఆయనతో దీనిపై ఎలాంటి చర్చలు జరగలేదని స్పష్టం చేశారు. ఎన్ శ్రీనివాసన్‌తో ఆయన వ్యక్తిగతంగా మాట్లాడారో లేదో తమకు తెలియదని వివరించారు. గతంలో సీఎస్కే షేర్లు ప్రైవేట్ విక్రయానికి అందుబాటులో ఉన్న సమయంలో ధోనీ కొన్ని షేర్లను కొనుగోలు చేసిన మాట నిజమేనని ఫ్రాంచైజీ వర్గాలు వెల్లడించాయి. ఈ షేర్లు బహిరంగ మార్కెట్లో విక్రయించబడవు కాబట్టి ప్రైవేట్‌గానే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ధోనీ వద్ద లక్షకు పైగా షేర్లు ఉన్నప్పటికీ, మొత్తం ఫ్రాంచైజీ వాటాతో పోలిస్తే అది చాలా చిన్న భాగం మాత్రమే. ప్రస్తుతం శ్రీనివాసన్ కుటుంబం వద్దే 55 శాతానికి పైగా ప్రైవేట్ వాటాలు భద్రంగా ఉన్నాయి. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న ధోనీ సెప్టెంబర్ 22 నాటికి భారత్‌కు తిరిగి రానున్నారు. ఆయన స్వదేశానికి చేరుకున్న వెంటనే ఐపీఎల్ 2027 వేలానికి సంబంధించి, అలాగే ఆటగాళ్ల ట్రేడింగ్, బదిలీలపై సీఎస్కే యాజమాన్యం ఒక కీలక సమావేశం నిర్వహించనుంది. ప్రధానంగా సీఎస్కే




కొత్త హెడ్ కోచ్ ఎంపికలో ధోనీ పాత్ర అత్యంత కీలకం కానుంది. ఒక విదేశీ దిగ్గజ ఆటగాడిని కోచ్‌గా నియమించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. అభిమానుల్లో ఎన్నో సందేహాలు ఉన్నప్పటికీ ధోనీ, సీఎస్కే బంధం ఎప్పటిలాగే బలంగా ఉంది. సెప్టెంబర్ చివరి వారంలో జరగబోయే సీఎస్కే సమావేశం తర్వాత కొత్త కోచ్ ఎవరనే దానిపై పూర్తి స్పష్టత రానుంది.

# 309 ఇన్నింగ్స్‌ల్లో 69వ అర్ధశతకం



చరిత్ర సృష్టించిన ఇంగ్లాండ్ కెప్టెన్ రూట్

రెడ్ బాల్ క్రికెట్‌లో ఇంగ్లాండ్ రన్‌మెషీన్ జో రూట్ తన సూపర్ ఫామ్ కొనసాగిస్తూ సరికొత్త చరిత్ర సృష్టించాడు. టెస్టు క్రికెట్ చరిత్రలోనే అత్యధిక అర్ధశతకాలు సాధించిన బ్యాటర్‌గా టీమిండియా క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న ఆల్‌టైమ్ వరల్డ్ రికార్డును రూట్ బద్దలు కొట్టాడు. ఎడ్జ్‌బాస్టన్‌లో పాకిస్థాన్‌తో జరిగిన మూడో టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో హాఫ్ సెంచరీ బాదడం ద్వారా రూట్ తన కెరీర్‌లో 69వ టెస్టు ఫిఫ్టీని నమోదు చేసుకున్నాడు. సచిన్ టెండూల్కర్ 329 ఇన్నింగ్స్‌ల్లో 68 ఫిఫ్టీలు సాధించగా, రూట్ కేవలం 309 ఇన్నింగ్స్‌ల్లోనే ఈ మార్కును దాటేశాడు. ఈ ఇన్నింగ్స్‌తో జో రూట్ మరో భారీ మైలురాయిని చేరుకున్నాడు. ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో 1000 ప్లస్ టెస్టు పరుగులు పూర్తి చేసిన తొలి బ్యాటర్‌గా చరిత్ర పుటలకెక్కాడు. ఒకే వేదికపై నిలకడగా పరుగులు రాబడుతూ ప్రత్యర్థి బౌలర్లకు సింహస్వప్నంగా మారిన రూట్, ఈ మైదానంలో ఇంగ్లాండ్‌కు అనేక చారిత్రాత్మక విజయాలను అందించడంలో కీలక పాత్ర పోషించాడు. నాలుగు వేర్వేరు క్రికెట్ వేదికల్లో 1000 కంటే ఎక్కువ టెస్టు పరుగులు సాధించిన ప్రపంచంలోనే మూడో క్రికెటర్‌గా జో రూట్ నిలిచాడు. గతంలో లార్డ్స్ (2203 రన్స్), మాంచెస్టర్ (1128 రన్స్), ది ఓవల్ (1050 రన్స్) మైదానాల్లో వెయ్యికి పైగా పరుగులు చేసిన రూట్, ఇప్పుడు ఎడ్జ్‌బాస్టన్ (1000ం రన్స్)ను కూడా ఆ జాబితాలో చేర్చాడు. క్రికెట్ చరిత్రలో దక్షిణాఫ్రికా దిగ్గజం జాక్వెస్ కల్లిస్, ఆస్ట్రేలియా గ్రేట్ రికీ పాంటింగ్ మాత్రమే ఈ ఘనత సాధించగా, ఇప్పుడు రూట్ వారి సరసన నిలిచాడు.కాగా పాకిస్థాన్‌తో జరిగిన మూడో టెస్టులో ఇంగ్లాండ్.. 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. దీంతో మూడు టెస్టుల సిరీస్‌ను 3-0తో క్లీన్ స్వీప్ చేసింది. ఇక ఇంగ్లాండ్, పాకిస్థాన్ టెస్ట్ సిరీస్‌లో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా ఇంగ్లాండ్‌కు చెందిన ఓలీ రాబిన్సన్, పాక్ పేసర్ మహమ్మద్ అబ్బాస్ నిలిచారు.



# సంపాదకీయం

## బ్రిక్స్‌కు సరికొత్త దిశ..

ప్రపంచ ఆర్థిక, రాజకీయ యవనికపై శరవేగంగా మారుతున్న సమీకరణల నడుమ భారత్ మరో చారిత్రక ఘట్టానికి ఆతిథ్యమిస్తోంది. ఢిల్లీ వేదికగా జరుగుతున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు విశ్వశాంతికి, ప్రపంచ మానవాళి సంక్షేమానికి సరికొత్త దిశను నిర్దేశిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్న వేళ... ఆహారం, ఇంధనం, ఆరోగ్యం, విపత్తుల నిర్వహణ, కీలకమైన సరఫరా వ్యవస్థల పరిరక్షణే లక్ష్యంగా ఈ రెండు రోజుల సదస్సు సాగుతుంది. సవాళ్లతో కూడుకున్న ప్రపంచ పరిస్థితులలో ఒక బలమైన అనుసంధానకర్తగా తన నాయకత్వాన్ని చాటుకునేందుకు భారత్ ముందుకు సాగుతుంది. మరోవైపు ఈ ఏడాది బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం చారిత్రాత్మకమైనదని ప్రధాని మోదీ అభివర్ణించారు. బ్రిక్స్ ఏర్పడి 20 ఏళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో.. ఈ వేదిక ఇప్పుడు కొత్త దశలోకి అడుగుపెడుతోందన్నారు. 20 ఏళ్ల వయసు మానవ జీవితంలో పరిపక్వత, బాధ్యతలు పెరిగే దశకు సంకేతమని.. అదే విధంగా బ్రిక్స్ కూడా తన పరిణతి దశకు చేరుకుందని ప్రధాని వ్యాఖ్యానించారు. గత రెండు దశాబ్దాల్లో ప్రపంచ వేదికపై బ్రిక్స్ ప్రత్యేక గుర్తింపు సాధించిందని తెలిపారు. ఎవరికీ వ్యతిరేకంగా కాకుండా.. అందరినీ కలుపుకొని ముందుకు సాగాలన్నదే బ్రిక్స్ విధానంగా ఉండాలని ఆయన అన్నారు. సభ్య దేశాల మధ్య ఐక్యత, ఏకాభిప్రాయాన్ని స్పష్టమైన ఫలితాలుగా మార్చాల్సిన సమయం వచ్చిందని పేర్కొన్నారు. ఈ 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ప్రసంగంతో ప్రారంభమైంది. బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను భారత్ నిర్వహిస్తున్న నేపథ్యంలో.. ప్రపంచ పాలనలో సంస్కరణలు, గ్లోబల్ సౌత్‌కు సముచిత ప్రాతినిధ్యం, ఆర్థిక సంస్థల్లో మార్పులు వంటి అంశాలపై ప్రధాని మోదీ తన ప్రసంగంలో స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. రాబోయే 20 ఏళ్లకు బ్రిక్స్ ఒక కొత్త, ప్రతిష్టాత్మక అజెండాతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. భారత్ బ్రిక్స్ అధ్యక్షత ప్రజా కేంద్రిత, మానవతా ప్రథమ విధానం ఆధారంగా కొనసాగుతోందని ప్రధాని మోదీ చెప్పారు. సౌలభ్యం, ఆవిష్కరణ, సహకారం, స్థిరత్వం తమ ప్రాధాన్యతలని వెల్లడించారు. ప్రపంచ పాలనలో సంస్కరణలకు సంబంధించి సమగ్ర రోడ్‌మ్యాప్ రూపొందించాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈ రోడ్‌మ్యాప్‌కు ప్రాతినిధ్యం, స్పందన/జవాబుదారీతనం, నియమాల రూపకల్పన అనే మూడు అంశాలు ప్రాతిపదికగా ఉండాలని సూచించారు. ప్రపంచ వ్యవస్థలో అన్ని దేశాలకు సముచిత ప్రాతినిధ్యం ఉండాలని, నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలు మరింత సమగ్రంగా ఉండాలని ఆయన అన్నారు.ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సంస్కరణలను ఇకపై వాయిదా వేయకూడదని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఈ అంశంపై చర్చలు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా నిర్దిష్ట కాలపరిమితి, స్పష్టమైన ఫలితాలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రపంచ పరిస్థితులు మారుతున్నప్పటికీ అంతర్జాతీయ సంస్థల్లో ప్రాతినిధ్య వ్యవస్థ మాత్రం మార్పులకు అనుగుణంగా లేదని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుత ప్రపంచ వాస్తవాలకు అనుగుణంగా అంతర్జాతీయ సంస్థలను సంస్కరించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.ప్రపంచ ఆర్థిక వ్యవస్థను నడిపిస్తున్న దేశాలకు గ్లోబల్ ఎకనామిక్ గవర్నెన్స్‌లో తగిన పాత్ర లభించాలని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అంతర్జాతీయ ఆర్థిక సంస్థల్లో ఓటింగ్ హక్కులు, నాయకత్వ పదవులు, విధాన ప్రాధాన్యతలు నేటి ఆర్థిక వాస్తవాలకు అనుగుణంగా మారాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచ ఆర్థిక వృద్ధికి కీలకంగా ఉన్న దేశాలు.. ప్రపంచ ఆర్థిక పాలనను రూపొందించే ప్రక్రియలో కూడా తగిన స్థానం పొందాలని స్పష్టం చేశారు.రాబోయే 20 ఏళ్లకు కొత్త, ప్రతిష్టాత్మక అజెండాతో బ్రిక్స్ ముందుకు సాగాలని ప్రధానమంత్రి మోదీ ప్రతిపాదించారు. ప్రతి ఏడాది బ్రిక్స్ అధ్యక్ష పదవి మారుతున్నప్పటికీ.. దీనివల్ల సంస్థాగత కార్యక్రమాల వేగం తగ్గకూడదన్నారు. ఇందుకోసం 'కొనసాగింపు మరియు అమలు యంత్రాంగం' ఏర్పాటు చేయాలని భారత్ ప్రతిపాదిస్తోందని తెలిపారు. దీని కింద బ్రిక్స్ కార్యక్రమాలు, నిర్ణయాలు, ఫలితాలను ట్రోయికా ద్వారా పర్యవేక్షించవచ్చని సూచించారు. ప్రపంచ సంక్షోభాలను ఎదుర్కొనే విషయంలో గ్లోబల్ సౌత్ దేశాలు ముందువరుసలో ఉన్నప్పటికీ.. నిర్ణయాలు తీసుకునే ప్రక్రియల్లో మాత్రం వెనుకబడి ఉన్నాయని ప్రధాని మోదీ అన్నారు. ఈ పరిస్థితిని మార్చాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ.. 'విశేషాధికారాల పిరమిడ్'ను 'భాగస్వామ్య వేదిక'గా మార్చాలని పిలుపునిచ్చారు. ప్రతి దేశం గొంతు వినిపించేలా, ప్రతి సభ్యుడికి భాగస్వామ్యం ఉండేలా ప్రపంచ వ్యవస్థ మారాలని అన్నారు.గ్లోబల్ ఆర్థిక సంస్థల్లో మార్పులు, గ్లోబల్ సౌత్‌కు సముచిత ప్రాతినిధ్యం వంటి అంశాలపై మోదీ ప్రసంగం అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఏదేమైనా ఈసారి భారత్ లో జరిగే ఈ సదస్సుపై ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. నేడు రెండవ రోజు జరిగే పరిణామాలపైనే ఎక్కువగా దృష్టి సారించ వచ్చునని పలువురు అభిప్రాయపడుతున్నారు.

.......................

# సాగునీటి ప్రాజెక్టులపై చిత్తశుద్ధి అమోఘం

- చంద్రబాబు సారథ్యంలో ఏపీ సురక్షితం
- అమరావతి బయో వ్యాలీకి కేంద్రం అండ
- కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా వెల్లడి

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి జీవనాధారమైన సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చూపిస్తున్న చిత్తశుద్ధి, పట్టుదల ప్రశంసనీయమని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా కొనియాడారు. కేవలం ఆరోగ్య రంగంపైనే కాకుండా, రాష్ట్ర భవిష్యత్తును నిర్దేశించే కీలకమైన జలవనరులపైనా ముఖ్యమంత్రికి ఉన్న పట్టు అద్భుతమని ఆయన అన్నారు. శనివారం విజయవాడలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోలవరం ఎడమ కాలువ, వెలిగొండ, హంద్రీ-నీవా వంటి కీలక ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లడంలో చంద్రబాబు చొరవ రాష్ట్ర ప్రగతికి ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. సాగునీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవడం ద్వారానే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని, ఈ దిశగా చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ఆరోగ్య శాఖ మంత్రిగా పర్యటనకు వచ్చినప్పటికీ, రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై ఆయన ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించడం గమనార్హం.రాజధాని అమరావతిలో ఏర్పాటు చేయ తలపెట్టిన క్వాంటం బయో వ్యాలీకి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనను జేపీ నడ్డా స్వాగతించారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం అందిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టుపై మరింత లోతుగా చర్చించేందుకు, అవసరమైన సూచనలు చేసేందుకు త్వరలోనే కేంద్రం నుంచి ఒక సాంకేతిక బృందాన్ని అమరావతికి పంపుతామని వెల్లడించారు. క్వాంటం బయో వ్యాలీ ఏర్పాటుపై ముఖ్యమంత్రి చేసిన సూచనలు, ఆయన విజన్ అద్భుతంగా ఉన్నాయని, వాటిని తప్పకుండా పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'సంజీవని' కార్యక్రమంపై నడ్డా ప్రత్యేక ప్రశంసలు కురిపించారు. ప్రజల ఆరోగ్య రక్షణకు ఈ కార్యక్రమం ఒక గొప్ప ముందడుగని అభివర్ణించారు. వ్యాధులను ముందుగానే గుర్తించి, నివారించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని, ఈ లక్ష్యంతో పనిచేస్తున్న సంజీవని కార్యక్రమాన్ని జాతీయ స్థాయిలో అమలు చేసే అవకాశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన వైద్యం అందించాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు కేంద్రం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ సురక్షితమైన చేతుల్లో ఉందని జేపీ నడ్డా అన్నారు. చంద్రబాబు ఒక దార్శనికుడని, నిబద్ధత కలిగిన నాయకుడని కొనియాడారు. ఉమ్మడి రాష్ట్రంలోనే కాకుండా, విభజన తర్వాత నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధిలోనూ చంద్రబాబు పోషిస్తున్న పాత్ర మరువలేనిదని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన "వంటిల్లే ఫార్మసీ-ఆహారమే ఔషధం" అనే మాటను



నడ్డా తన ప్రసంగంలో పలుమార్లు ప్రస్తావించారు. ఆ మాటలు నూటికి నూరు శాతం నిజమని, ఆరోగ్యానికి అదే మూల సూత్రమని వ్యాఖ్యానించారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, ఆహారపు అలవాట్లపై ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారానే వ్యాధులను దూరం చేయగలమని ఆయన అభిప్రాయపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తాయని ఆయన స్పష్టం చేశారు.

# కొత్త రైళ్ల కొనుగోలుకు పచ్చజెండా

- మెట్రో ప్రయాణికులకు శుభవార్త
- 600 కోట్ల వ్యయంతో కొత్త రైళ్ల కొనుగోలు
- రద్దీని తగ్గించేందుకు ప్రభుత్వ నిర్ణయం

హైదారాబాద్, సెప్టెంబర్ 12: హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ తెలిపింది. మెట్రో రైళ్లల్లో రద్దీని తగ్గించేందుకు ప్రభుత్వం ముందడుగు వేసింది. ప్రస్తుతం పీక్ సమయాల్లో మెట్రోలలో విపరీతమైన రద్దీ ఉంటుంది. కనీసం నిల్చోవడానికి కూడా స్థలం ఉండటం లేదు. ఈ సమస్యతో మెట్రో ప్రయాణికులు ఎప్పటినుంచో ఇబ్బంది పడుతుండగా.. ఇప్పుడు పరిష్కారానికి ప్రభుత్వం సిద్దమైంది. రద్దీని తగ్గించేందుకు కొత్త రైళ్లను తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం కొత్త రైళ్లను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం రెడీ అవుతోంది. ఒక్కొ రైల్లో 2 వేల మంది ప్రయాణించేందుకు వీలుగా 6 కోచ్‌ల రైళ్లను ప్రవేశపెట్టనుంది.తొలి దశలో 60 కోచ్‌లను కొనుగోలు చేయనుండగా.. ఆరు కోచ్‌లతో కూడిన 10 కొత్త రైళ్లను అందుబాటులోకి తీసుకొస్తారు. ఒక్కొ రైలుకు రూ.60 కోట్ల వరకు ఖర్చు కానుంది. 60 కోచ్‌ల కొనుగోలుకు రూ.600 కోట్ల వరకు వ్యయం కానుందని అంచనా వేశారు. త్వరలోనే కొత్త రైళ్ల కోసం టెండర్లను ఆహ్వానించనున్నారు. బిడ్ల కోసం నోటిఫికేషన్ జారీ చేసిన తర్వత తుది వ్యయం ఎంత అవుతుందనేది తెలియనుంది. ప్రస్తుతం ఉన్న మెట్రో రైళ్లల్లో మూడు కోచ్‌లు మాత్రమే అందుబాటులోకి ఉన్నాయి. దీంతో ఒకేసారి వెయ్యి మంది మాత్రమే ప్రయాణించడానికి వీలు కలుగుతుంది. అదే ఆరు కోచ్‌లు అందుబాటులోకి వస్తే ఒకేసారి 2 వేల మంది ప్రయాణించవచ్చు. ప్రయాణికుల సంఖ్య దాదాపు రెట్టింపు అవుతుంది. వీటి వల్ల ఒకేసారి ఎక్కువమంది ప్రయాణికులకు తమ గమ్యస్థానాలకు చేర్చవచ్చు.ఎక్కువ కోచ్‌లు కలిగిన రైళ్లు ఉండటం వల్ల ప్రయాణికుల రద్దీ కూడా తగ్గుతుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ విపరీతంగా ఉండటం వల్ల కనీసం అడుగు వేసేందుకు కూడా ఖాళీ స్థలం ఉండటం లేదు. దీని వల్ల ఇబ్బంది పడుతూ ప్రయాణం చేయాల్సి వస్తోంది. కొన్నిసార్లు తర్వాతి రైలు కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. ప్రస్తుతం మెట్రోలో



రోజూ 4.5 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. అయితే కొత్త మెట్రో రైళ్లు వస్తే 6 లక్షల వరకు పెరుగుదతుందని అధికారులు చెబుతున్నారు. అమీర్ పేట-రాయదుర్గం మార్గంలో ఎక్కువ రద్దీ ఉంటుంది. ఉదయం ఆఫీసులకు వెళ్లే సమయంలో, సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చే సమయాల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీని వల్ల రాయదుర్గం స్టేషన్‌లో కొన్నిసార్లు ప్రయాణికులకు కొద్దిసేపు ఆపాల్సి వస్తోంది. రద్దీని నియంత్రించేందుకు అధికారులు ఈ ప్రయత్నం చేస్తున్నారు. దీంతో కొత్త రైళ్లను తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇవి అందుబాటులోకి వస్తే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. సౌకర్యవంతంగా ప్రయాణం చేయవచ్చు.

# స్త్రీనిధి రుణాల్లో రూ.30 లక్షల అవకతవకలు

**సంగారెడ్డి జిల్లాలో వెలుగులోకి ఘరానా మోసం**
**అవకతవకలఆపి సంఘ సభ్యుల ఆగ్రహం**

హైదారాబాద్, సెప్టెంబర్ 12 సంగారెడ్డి జిల్లా కంది మండలం పాతకంది గ్రామ సంఘంలో మహిళా సంఘాలకు మంజూరైన స్త్రీనిధి, బ్యాంక్ లింకేజీ రుణాల్లో భారీగా అవకతవకలు జరిగినట్లు తేలింది. వివిధ మహిళా సంఘాల పేర్లపై మంజూరైన రుణాల్లో సుమారు రూ.30 లక్షల మేర నిధులను మాజీ వీవోఏ వినియోగించినట్లు విచారణ నివేదికలో వెల్లడైనట్లు సమాచారం. రుణాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న మహిళలకు ఈ వ్యవహారం తీవ్ర ఆగ్రహాన్ని కలిగించింది. దీంతో సదురు మహిళా సభ్యులు మంగళవారం కందిలో నిర్వహించిన డ్వాక్రా మహిళా సంఘాల సమావేశంలో అధికారులను నిలదీశారు.వీవోఏ మార్పు.. వెబ్‌సైట్‌లో నమోదు కాలేదంటూ నివేదిక గత ఏడాది జనవరిలో గ్రామ సంఘం వీవోఏను తొలగించి కుమ్మరి పుష్పలతను కొత్త వీవోఏగా ఎన్నుకున్నట్లు విచారణ నివేదికలో పేర్కొన్నారు. అయితే ఇప్పటి వరకు ఆమె పేరు సెర్ప్ ఐబీ వెబ్‌సైట్‌లో నమోదు కాలేదని గుర్తించినట్లు అధికారులు తెలిపారు. అయినప్పటికీ రూ.50 వేల గౌరవ వేతనం డ్రా చేసి ఆమెకు చెల్లించినట్లు నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. గ్రామ సంఘ సమావేశాలకు మండల సమాఖ్య నుంచి కమ్యూనిటీ




కోఆర్డినేటర్ క్రమం తప్పకుండా హాజరు కాకపోవడం, ఏపీఎం స్థాయిలో సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఈ అవకతవకలకు అవకాశం ఏర్పడినట్లు విచారణ నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. విచారణలో సుమారు రూ.30 లక్షల మేర అవకతవకలు వెలుగులోకి వచ్చినట్లు అధికారులు గుర్తించినప్పటికీ.. ఇప్పటి వరకు మాజీ వీవోఏపై కఠిన చర్యలు తీసుకోలేదని మహిళా సంఘాల సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు రావాల్సిన రుణాలను వెంటనే మంజూరు చేయడంతో పాటు, నిధుల దుర్వినియోగానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాల సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. తమ ఆర్థిక అవసరాలను తీర్చుకునేందుకు స్త్రీనిధి, బ్యాంక్ లింకేజీ రుణాలపై ఆధారపడుతున్న తమకు ఈ పరిణామం తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని వారు పేర్కొంటున్నారు. బాధ్యుల పై చర్యలు తీసుకోవాలని మహిళలు డిమాండ్ చేస్తున్నారు.

# 253 కోట్లతో దేశంలోనే అతిపెద్ద ఫోరెన్సిక్ ల్యాబ్

అమరావతి, సెప్టెంబర్ 12 :రీజినల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబోరేటరీలు పోలీసు నేర పరిశోధనకు వెన్నుముక లాంటివని ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా స్పష్టం చేశారు. ఈరోజు రాజమండ్రిలో పర్యటించిన ఆయన... రాజధాని అమరావతిలోని తుళ్లూరులో రూ.253 కోట్లతో 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో దేశంలోనే అతిపెద్ద స్టేట్ లెవల్ ఫోరెన్సిక్ ల్యాబ్‌ను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా రాజమండ్రి, తిరుపతి, అనంతపురం, విశాఖ సహా పలు కేంద్రాల్లో ఆర్ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్‌లను ఆధునికీకరిస్తున్నామని తెలిపారు. డీఎన్ఏ నివేదికలను ప్రస్తుతం 7 రోజుల్లోనే, అత్యంత కీలకమైన కేసుల్లో 13 గంటల్లోనే అందిస్తున్నామని చెప్పారు. అలాగే, సైబర్ నేరాల నియంత్రణకు జిల్లా స్థాయిలో 'క్లిక్' కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాజమండ్రి గోదావరి పుష్కరాల సందర్భంగా రద్దీ నివారణకు అధునాతన డ్రోన్లు, రికార్డింగ్ మోడ్‌లోని సీసీటీవీల ద్వారా భద్రతను పర్యవేక్షిస్తామని డీజీపీ పేర్కొన్నారు.



# 29 ఏళ్ల తర్వాత.. మైక్రోసాఫ్ట్‌ను వీడుతున్న కమ్యూనికేషన్స్ ఆఫీసర్

లాస్ ఏంజిల్స్: మైక్రోసాఫ్ట్ కంపెనీలో మూడు దశాబ్దాలుగా సేవలు అందించిన చీఫ్ కమ్యూనికేషన్స్ ఆఫీసర్ ఫ్రాంక్ షా(ఖీతీఝఅ ాష్టుషు) తన ఉద్యోగాన్ని వీడనున్నారు. తన నిర్ణయం గురించి ఆయన ఉద్యోగులకు ఇంటర్నల్ మెమో ద్వారా వెల్లడించారు. లింకిడిన్‌లో ఓ నోట్ షేర్ చేశారు. ఇక ఉద్యోగాన్ని వీడి, జీవితంలో కొత్త అన్వేషణ ప్రారంభించాలనుకుంటున్నట్లు ఆయన చెప్పారు. 29 ఏళ్లుగా ఆయన మైక్రోసాఫ్ట్‌లో వివిధ హోదాల్లో పని చేశారు. కంపెనీకి చెందిన పీఆర్ ఏజెన్సీ వాగ్నర్ ఎడ్‌స్ట్రామ్‌లో ఆయన కొన్నేళ్లుగా చేశారు. అయితే 17 ఏళ్లుగా మాత్రం ఆయన మైక్రోసాఫ్ట్ చీఫ్ కమ్యూనికేషన్ ఆఫీసర్‌గా చేస్తున్నారు. ఇక ఈ ఏడాది చివరి వరకు ఆయన ఉద్యోగంలో కొనసాగనున్నారు. ఆ పోస్టుకు కొత్తగా ఎవరు వస్తారన్న విషయాన్ని మాత్రం ఆయన వెల్లడించలేదు.1997 నుంచి మైక్రోసాఫ్ట్‌లో ఫ్రాంక్ షా స్ట్రాటజిక్ మెసేజింగ్ ఆఫీసర్‌గా చేశారు. విండోస్ లాంచింగ్ సమయాల్లో ఆయన పబ్లిక్ కమ్యూనికేషన్ స్ట్రాటజీ చూసుకున్నారు. మార్కెటింగ్ చీఫ్ తకేసితో తన నిర్ణయాన్ని పంచుకున్నట్లు చెప్పారు. కమ్యూనికేషన్ టీమ్‌లో అనేక మంది ట్యాలెంట్ ఉద్యోగులతో పనిచేసినట్లు ఆయన తెలిపారు.

# దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి లక్షల కోట్ల పెట్టుబడులు వెనక్కి ఇప్పటిదాకా రూ.2.80 లక్షల కోట్లు ఉపసంహరణ



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11: దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్ఐఐలు) తమ పెట్టుబడులను పెద్ద ఎత్తున వెనుకకు తీసుకుంటున్నారు. ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా దాదాపు రూ.2.80 లక్షల కోట్ల పెట్టుబడులను ఎఫ్ఐఐలు ఉపసంహరించుకున్నారు. గత ఏడాది రూ.2.39 లక్షల కోట్లు వెనక్కి తీసుకోగా.. 2024లో రూ.1.28 లక్షల కోట్లు తరలిపోయాయి. అయితే 2025లో సుమారు రూ.74,000 కోట్లు, 2024లో దాదాపు రూ.1.21 లక్షల కోట్ల పెట్టుబడులనూ తీసుకొచ్చారు. దీంతో నిరుడు రూ.1.65 లక్షల కోట్లు, అంతకుముందు ఏడాది రూ.7,000 కోట్లు పడిపోయినైట్టెంది. ఈ ఏడాది ఇది ఏకంగా రూ.2.33 లక్షల కోట్లుగా ఉండటం గమనార్హం. రూ.47,000 తిరిగి తెచ్చారు మరి.ఐపీవోలపై ఆసక్తిస్టాక్ మార్కెట్లలో ఇప్పటికే నమోదైన సంస్థల్లో నుంచి పెట్టుబడులను లాగేసుకునే పనిలోపడ్డ ఎఫ్ఐఐలు.. కొత్తగా నమోదవుతున్న కంపెనీలపట్ల మాత్రం ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటిదాకా ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ల (ఐపీవో)లో రూ.47,000 కోట్ల పెట్టుబడులను పెట్టడం ఇందుకు నిదర్శనం. నూతన రంగాల్లోకి ప్రవేశించాలన్న కోరికతోపాటు, షేర్ల ధరలు తక్కువగా ఉండటంతో మెజారిటీ ఎఫ్ఐఐలు ఇప్పుడు పాత షేర్లను అమ్ముకుని కొత్త షేర్లను చౌకగా దక్కించుకోవడంపైనే దృష్టి సారిస్తున్నారు. ప్రస్తుత ప్రతికూల పరిస్థితులకు మార్కెట్ లిస్టెడ్ షేర్లు తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతుండటం, అమ్మకాల ఒత్తిడికి గురవుతుండటం.. ఇన్వెస్టర్లకు నష్టాలను మిగులుస్తున్నాయి. దీంతోనే నయా కంపెనీలపై ఆసక్తి కనబరుస్తున్నారని మార్కెట్ నిపుణులు ప్రస్తుత ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు.

వైవిధ్యం చూపుతూ..ఎఫ్ఐఐలు భారతీయ స్టాక్ మార్కెట్లలో బ్యాంకింగ్, ఐటీ సర్వీసెస్, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ షేర్లలో భారీగా పెట్టుబడులు పెట్టారు. అయితే ఇప్పుడు ఈ రంగాల్లో వృద్ధి పరిమితంగానే తయారైంది. దీంతో ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్, కన్జ్యూమర్ టెక్నాలజీ, రెన్యువబుల్స్, క్యాపిటల్ మార్కెట్ వ్యాపారాల్లో పెట్టుబడులపై దృష్టిసారిస్తున్నారు. అందుకే ఈ రంగాలకు చెందిన సంస్థలు ఐపీవోలకు వచ్చినప్పుడు భారీగా షేర్ల కొనుగోలుకు దిగుతున్నారని ఎక్స్‌పర్ట్స్ చెప్తున్న మాట.

# బరువు తగ్గినా.. శరీరం గతాన్ని మరచిపోదా?

అధిక బరువు తగ్గితే ఆరోగ్యపరమైన ప్రమాదాలన్నీ తగ్గిపోతాయని సాధారణంగా అనుకుంటాం. అయితే శరీరం గతంలో ఎదురొన్న అధిక బరువు ప్రభావాన్ని కొంతకాలం గుర్తుంచుకుంటుందన్న ఆసక్తికరమైన విషయాన్ని ఓ తాజా పరిశోధన వెల్లడించింది. ఈ అధ్యయనాన్ని బ్రిటన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ బర్మింగ్‌హామ్ పరిశోధకులు నిర్వహించారు. ఇటీవల వెలువడిన ఈ పరిశోధన ప్రకారం, అధిక బరువుతో ఉన్న కాలంలో రోగనిరోధక వ్యవస్థలోని కొన్ని ముఖ్యమైన కణాల్లో ఏర్పడిన అణు స్థాయి మార్పులు, బరువు తగ్గిన తర్వాత కూడా ఐదు నుంచి పది సంవత్సరాల వరకూ కొనసాగవచ్చని పరిశోధకులు గుర్తించారు. దీనిని శాస్త్రవేత్తలు ఒక రకమైన 'శరీర జ్ఞాపకం'గా అభివర్ణిస్తున్నారు.



అంటే బరువు తగ్గిన వెంటనే శరీరంలోని ప్రతి వ్యవస్థ గతస్థితిని పూర్తిగా మరచిపోతుందని చెప్పలేమన్నమాట. ముఖ్యంగా రోగనిరోధక కణాల్లో అధిక బరువు ముద్ర కొంతకాలం కొనసాగడం వల్ల, బరువు తగ్గిన తర్వాత కూడా కొన్ని ఆరోగ్యపరమైన సమస్యలు పూర్తిగా తగ్గడం లేదన్న విషయాన్ని ఇది చర్చిస్తున్నది. అధిక బరువుతో ఉండి బరువు తగ్గే ఇంజెక్షన్లు తీసుకున్న వారు, చిన్నప్పటి నుంచే ఊబకాయానికి దారి తీసే అరుదైన ఆల్ స్ట్రోమ్ సిండ్రోమ్ ఉన్నవారు, పది వారాల వ్యాయామ కార్యక్రమంలో పాల్గొన్న వారు, కాలికి సంబంధించిన శస్త్ర చికిత్స చేయించుకున్న సాధారణ, అధిక బరువు ఉన్న వ్యక్తులను ... పది సంవత్సరాల కాలం పాటు పరిశీలించి ఈ ఫలితాలను వెల్లడించారు. అయితే దీన్ని 'బరువు తగ్గినా ప్రయోజనం లేదు' అని అర్థం చేసుకోవడం మాత్రం పొరపాటు. బరువు తగ్గడం వల్ల ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలు ఉంటాయి. ఈ పరిశోధన చెబుతున్నది ఒకటే... అధిక బరువు శరీరంపై చూపే ప్రభావం కేవలం కొవ్వు పరిమాణానికే పరిమితం కాకుండా, శరీరంలోని కొన్ని కణస్థాయి మార్పులతో కూడా ముడిపడి ఉండవచ్చని. ఈ అధ్యయనం భవిష్యత్తులో అధిక బరువుతో సంబంధం ఉన్న ఆరోగ్య సమస్యలను మరింత లోతుగా అర్థం చేసుకోవడానికి ఉపయోగపడవచ్చని పరిశోధకులు భావిస్తున్నారు. అయితే ఈ మార్పులు ఒక్కో వ్యక్తిలో ఎలా ఉంటాయి? వాటిని పూర్తిగా తగ్గించేందుకు ఏం చేయాలి? వంటి ప్రశ్నలకు ఇంకా విస్తృతమైన పరిశోధనలు అవసరం.

# చక్కెరతో క్యాన్సర్

షుగర్ అధికంగా ఉండే పానీయాలను రెగ్యులర్‌గా తీసుకోవడం ఆరోగ్యానికి ఏమాత్రం మంచిది కాదన్న విషయం తెలిసిందే! అయితే, అది కేవలం బరువు పెరగడమో, మధుమేహం రావడానికో మాత్రమే పరిమితం కాదని నిపుణులు అంటున్నారు. కృత్రిమ చక్కెరలు కలిపిన పానీయాలు ఎక్కువగా తాగితే.. కడుపు క్యాన్సర్ ముప్పు రెట్టింపు అవుతుందని హెచ్చరిస్తున్నారు. తాజా పరిశోధనల్లో భాగంగా, ఈ విషయాలను వెల్లడిస్తున్నారు.సాధారణ కూల్‌డ్రింక్స్, ఎనర్జీ డ్రింక్స్, ప్యాక్ చేసిన ఫ్రూట్ జ్యూస్‌లలో చక్కెర ఎక్కువగా ఉంటుంది. చాలామంది వీటిని రెగ్యులర్‌గా తీసుకుంటారు. అయితే, ఇలాంటి వాటిని అస్సలు ముట్టుకోని వారు, చాలా అరుదుగా తాగేవారితో పోలిస్తే.. ప్రతిరోజూ తాగేవారికి కడుపు క్యాన్సర్ వచ్చే అవకాశం రెండు రెట్లకు పైగా ఎక్కువగా ఉందని తాజా అధ్యయనం ఒకటి తేల్చింది.ఈ పానీయాలలోని అధిక చక్కెర.. జీర్ణవ్యవస్థలో అంతర్గత ఇన్‌ఫ్లమేషన్‌ను



పెంచుతుంది. ఇది కణాలను దెబ్బతీస్తుంది. ఇక ద్రవరూపంలోని చక్కెర నేరుగా శరీరంలోకి వెళ్లినప్పుడు.. రక్తంలో గ్లూకోజ్, ఇన్సులిన్ స్థాయులు ఒక్కసారిగా పెరుగుతాయి. దీర్ఘకాలంలో ఇది 'ఇన్సులిన్ రెసిస్టెన్స్'కు దారితీసి, క్యాన్సర్ కణాలు పెరిగేందుకు అనుకూల వాతావరణాన్ని సృష్టిస్తుంది. అంతేకాకుండా, కృత్రిమ చక్కెరలు జీర్ణాశయంలోని మంచి బ్యాక్టీరియాపై ప్రభావం చూపి, హానికర రసాయనాల ఉత్పత్తిని ప్రోత్సహిస్తాయి. ఇదికూడా క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని పెంచుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందుకే, కృత్రిమ చక్కెరలు కలిపిన పానీయాలకు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. సోడాలు, కృత్రిమ పండ్ల రసాలకు బదులుగా మంచి నీరు, నిమ్మకాయ నీళ్లు లేదా కొబ్బరి నీళ్లను ఎంచుకోవడం మంచిదని అంటున్నారు. ప్యాక్ చేసిన డ్రింక్స్ కొనేటప్పుడు లేబుల్‌పై ఉండే 'షుగర్స్' పరిమాణాన్ని తప్పకుండా గమనించాలని చెబుతున్నారు.

# అండాశయ క్యాన్సర్ చికిత్సకు ఉపయోగపడే సరికొత్త అధ్యయనం.. సైంటిస్టులు ఏం తేల్చారు..?

అండాశయ క్యాన్సర్ నిర్ధారణ అయిన మహిళలకు శస్త్రచికిత్స చేయాలా, కీమోథెరపీ అవసరమా, చికిత్స తర్వాత కోలుకునే అవకాశాలు ఎలా ఉన్నాయి అనే ప్రశ్నలు సాధారణంగా ఎదురవుతుంటాయి. అయితే ప్రస్తుతం మరో ముఖ్యమైన అంశం కూడా వైద్య రంగంలో ప్రాధాన్యం సంతరించుకుంటోంది. అదే.. కణితిలోని జన్యు లక్షణాలు ఆ క్యాన్సర్‌కు ఏ చికిత్స మెరుగ్గా పనిచేస్తుందో తెలుసుకోవడంలో ఎంతవరకు సహాయపడతాయన్నది. జన్యు పరీక్ష అంటే కేవలం వారసత్వంగా క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందా లేదా తెలుసుకోవడం మాత్రమే కాదు. కణితి ఎలా ప్రవర్తించే అవకాశం ఉందో, అలాగే నిర్దిష్ట చికిత్స వల్ల రోగికి ప్రయోజనం కలిగే అవకాశాలు ఉన్నాయా అనే విషయాన్ని అంచనా వేయడంలోనూ ఈ పరీక్ష కీలక పాత్ర పోషిస్తుంది. అండాశయ క్యాన్సర్ ఒకే జన్యువులో వచ్చే మార్పు వల్ల ఏర్పడే వ్యాధి కాదు. వివిధ కణితుల్లో భిన్నమైన పరమాణు లక్షణాలు కనిపిస్తాయి. ఈ లక్షణాలు రోగికి ఎలాంటి చికిత్స అందించాలనే నిర్ణయంపై ప్రభావం చూపుతాయి.

### దెబ్బ తిన్న డీఎన్ఏకు మరమ్మత్తు చేస్తే..

అండాశయ క్యాన్సర్‌లో గుర్తించే ముఖ్యమైన జన్యు మార్పుల్లో బీఆర్‌సీఏ1, బీఆర్‌సీఏ2 జన్యువులు ఉన్నాయి. దెబ్బతిన్న డీఎన్ఏకు మరమ్మత్తు చేయడంలో ఈ జన్యువులు కీలక పాత్ర పోషిస్తాయి. వీటిలో హానికరమైన మార్పులు ఏర్పడితే క్యాన్సర్ కణాలు దెబ్బతిన్న డీఎన్ఏను సరిచేసుకునే సామర్థ్యాన్ని కోల్పోయే అవకాశం ఉంటుంది. జన్యు పరీక్ష ద్వారా శరీరంలోని అన్ని కణాల్లో ఉండే వారసత్వ జన్యు మార్పులను గుర్తించవచ్చు. మరోవైపు, కణితిపై చేసే పరీక్ష ద్వారా కణితి అభివృద్ధి చెందుతున్న సమయంలో ఏర్పడిన జన్యు మార్పులను గుర్తిస్తారు. ఏ పరీక్ష చేయాలన్నది అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఈ పరీక్షల ఫలితాలు రోగిపైనే కాకుండా కుటుంబ సభ్యులపైనా ప్రభావం చూపే అవకాశం ఉంది. వారసత్వంగా వచ్చే జన్యు మార్పు గుర్తిస్తే, కుటుంబంలోని ఇతర సభ్యులు కూడా జన్యు పరీక్షలు, సంబంధిత సలహాలు తీసుకోవాల్సి వస్తుంది. జన్యు పరీక్ష ద్వారా లభించే సమాచారం చికిత్స ఎంపికలో కీలకంగా మారుతుంది. క్యాన్సర్ కణాల్లో డీఎన్ఏ మరమ్మత్తు వ్యవస్థలో లోపాలను లక్ష్యంగా చేసుకుని పనిచేసే మందుల్లో పీఏఆర్‌పీ నిరోధకాలు ముఖ్యమైనవి. కణితిలో బీఆర్‌సీఏ జన్యు మార్పు లేదా డీఎన్ఏ మరమ్మత్తుకు సంబంధించిన సమాన లోపం ఉంటే, క్యాన్సర్ కణాల్లో డీఎన్ఏను సరిచేసే వ్యవస్థ ఇప్పటికే బలహీనంగా ఉంటుంది. ఈ పరిస్థితిలో మరో మరమ్మత్తు మార్గాన్ని పీఏఆర్‌పీ నిరోధకాలతో అడ్డుకుంటే క్యాన్సర్ కణాలు జీవించలేని పరిస్థితి ఏర్పడుతుంది.

### గణనీయమైన మార్పు..

ముఖ్యంగా బీఆర్‌సీఏ జన్యు మార్పు ఉన్న కొన్ని రకాల అధునాతన అండాశయ క్యాన్సర్ల చికిత్సలో పీఏఆర్‌పీ నిరోధకాలు గణనీయమైన మార్పు తీసుకొచ్చాయి. అయితే బీఆర్‌సీఏ జన్యు మార్పు



లేకపోయినా, డీఎన్ఏ మరమ్మత్తు వ్యవస్థలో ఇతర లోపాలు ఉన్న కొంతమంది రోగులు కూడా ఈ చికిత్సకు స్పందించే అవకాశం ఉన్నట్లు వైద్యపరంగా నిర్ధారించారు. అండాశయ క్యాన్సర్ జన్యు పరీక్షల్లో బీఆర్‌సీఏ1, బీఆర్‌సీఏ2 జన్యువులు ఇప్పటికీ ముఖ్యమైనవే అయినప్పటికీ, ప్రస్తుతం పరీక్షలు ఒక్క ఈ రెండు జన్యువులకే పరిమితం కావడం లేదు. అనేక జన్యువులను ఒకేసారి పరిశీలించే విస్తృత పరీక్షలను కూడా ఉపయోగిస్తున్నారు.

డీఎన్ఏ దెబ్బతినడం, వారసత్వంగా వచ్చే క్యాన్సర్ల ప్రమాదంతో సంబంధం ఉన్న ఇతర జన్యువుల్లో కూడా వైద్యపరంగా ముఖ్యమైన మార్పులు ఉండే అవకాశం ఉంది.ఒక అధ్యయనంలో బీఆర్‌సీఏ జన్యువులతోపాటు పీఏఎల్‌బీ2, సీహెచ్ఈకే2 వంటి ఇతర జన్యువుల్లోనూ మార్పులు ఉన్నట్లు గుర్తించారు. దీనివల్ల కేవలం బీఆర్‌సీఏ జన్యువులను మాత్రమే పరీక్షిస్తే, చికిత్సపరంగా ముఖ్యమైన మరికొన్ని జన్యు మార్పులను గుర్తించలేకపోయే అవకాశం ఉందని స్పష్టమవుతోంది.




# డ్రామాతో సీక్రెట్ సోల్జర్..

నిహాల్ కోదాటి, సూర్య శ్రీనివాస్ హీరోలుగా అక్కి విశ్వనాథ్ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న యూనిక్ స్పై డ్రామా 'సీక్రెట్ సోల్జర్'. మూన్ లైట్ డ్రీమ్స్ బ్యానర్‌పై తెరకెక్కిన ఈ చిత్రంలో కమల్ కామరాజు, రఘుబాబు, రంగస్థలం మహేష్, శ్రీనివాస్ వడ్లమాని, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రలు పోషించారు.ఇప్పటికే ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ మంచి బజ్‌ను క్రియేట్ చేసింది. యూనిక్ కాన్సెప్ట్, ఆకట్టుకునే ప్రెజెంటేషన్, యాక్షన్, థ్రిల్, హ్యూమర్ ఎలిమెంట్స్‌తో విడుదలైన టీజర్ ట్రైలర్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. ఈ చిత్రం సెప్టెంబర్ 18న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నిహాల్ కోదాటి, సూర్య శ్రీనివాస్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు. 'చైనా పీస్'గా మొదలైన ప్రయాణం 'సీక్రెట్ సోల్జర్'గా ఎలా మారింది అన్న ప్రశ్నకు సమాధానమిస్తూ.. 'చైనా పీస్' పేరుతోనే టీజర్ రిలీజ్ చేశాను. అలాగే రెండు పాటలు కూడా విడుదల చేశాను. అదే పేరుతో చాలా మార్కెటింగ్ చేశాం. మార్చిలో సినిమా రిలీజ్ చేద్దామని సెన్సార్‌కు పంపించాను. సెన్సార్ నుంచి అభ్యంతరాలు వచ్చాయి. రివ్యూ కమిటీలు, ఈబీసీ చైర్మన్, మినిస్ట్రీ ఆఫ్ ఎక్స్‌టర్నల్ అఫైర్స్.. ఇలా అన్ని స్థాయిలు దాటుకుని లిస్టు పంపించారు. అందులో మొదటి పాయింట్.. టైటిల్ 'చైనా పీస్' ఉండకూడదు. ఈ కథ ఆలోచన, ఉద్దేశంతో ఆలోచించుకుని 'సీక్రెట్ సోల్జర్' అయితే బాగుంటుందని ఆ టైటిల్ పెట్టాం. సెన్సార్‌లో దాదాపు 8 నెలలు ఈ సినిమా ఉన్నప్పటికీ, మేం ఏ ఆలోచనతో సినిమా తీశామో.. ఆ ఆలోచన విషయంలో ఎలాంటి ఇబ్బంది రాలేదు. మా డైరెక్టర్ విశ్వనాథ్ గారు చాలా కష్టపడ్డారు. కంటెంట్ విషయంలో తగ్గించడానికి ఎక్కడా కూడా రాజీ పడలేదు. విజువల్స్ పరంగా చాలా చిన్న కట్స్ మాత్రమే వచ్చాయి. ఇది స్పై డ్రామా. ఇందులో స్పై యాక్షన్ కూడా చాలా రియలిస్టిక్‌గా ఉంటుంది. ఇండియా కి సంబధించిన ఓ కీలక ఇన్ఫర్మేషన్ లీక్ అయింది.



# నా సినిమాలను నేను చూడలేను

ప్రముఖ బాలీవుడ్ నటి ప్రీతి జింటా కొంత కాలంగా సినిమాలకు దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. కొంత విరామం తర్వాత ఆమె 'వైబ్' అనే యాక్షన్ కామెడీ మూవీతో పాటు 'బట్వారా 1947' చిత్రం గ్రాండ్ రీఎంట్రీ ఇస్తోంది.

'వైబ్'లో ఆమె 'మేడమ్ హెచ్' అనే పవర్‌ఫుల్ సూపర్ స్పై పాత్రలో కనిపించనున్నారు. వంశిక ధీర్, కునాల్ ఖేము, స్పర్ష్ శ్రీవాస్తవ ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రం సెప్టెంబర్ 18న ప్రేక్షకుల ముందుకు రానుంది.

తాజాగా జరిగిన ప్రమోషన్లలో నటి వంశిక ధీర్ మాట్లాడుతూ... పెద్ద తెరపై తనను తాను చూసుకున్నప్పుడు 'ఇంపాస్టర్ సిండ్రోమ్' అనిపించిందని చెప్పగా, ప్రీతి జింటా ఆసక్తికరంగా స్పందించింది. ఇన్ని ఏళ్ల అనుభవం ఉన్నా,ం ప్రతి కొత్త పాత్ర చేసేటప్పుడు 'చేయగలనా, లేదా?' అనే సందేహం తనకూ వస్తుందని ఆమె చెప్పింది. "నేను నా సినిమాలను స్క్రీన్ పై ఎప్పుడూ చూడలేను. థియేటర్‌లో కూర్చోవడం చాలా ఇబ్బందిగా ఉంటుంది. సినిమా చూస్తున్నంతసేపు ఈ సీన్ ఇంకా బాగా చేసి ఉంటే బాగుండేది అనే ఆలోచనే వస్తుంది" అని ప్రీతి వెల్లడించింది.

# తెలుగులోకి 'హనుమాన్ అంశ్'



రూ. 2 కోట్లతో తీసిన సినిమా బాక్సాఫీస్ వద్ద రూ. 150 కోట్లకు పైగా కలెక్ట్ చేసిందంటే ఎవరైనా షాక్ అవ్వాల్సిందే. అది కూడా ఎలాంటి స్టార్ కాస్ట్, ప్రమోషన్లు, అంచనాలు లేకుండా సైలెంట్ బాలీవుడ్ లో రిలీజ్ అయిన ఓ చిన్న సినిమా గురించి ఇప్పుడు యావత్ దేశం మొత్తం మాట్లాడుకుంటుంది. అదే "హనుమాన్ అంశ్" చిత్రం.. ఈ సినిమాను ఇంతలా ఆదరించడానికి గల కారణం ఏంటి..? అని అనుకుంటున్నారా..? ఆధ్యాత్మిక గురువు నీమ్ కరోలీ బాబా జీవితం ఆధారంగా ఈ సినిమా రూపొందింది. కేవలం ప్రేక్షకుల మౌత్ టాక్ తో పుంజుకుని ఇప్పుడు ఏకంగా రూ. 150 కోట్లకు పైగా కలెక్షన్లు కొల్లగొట్టింది. అయితే ఇప్పుడు ఈ మూవీ తెలుగులోనూ రాబోతోంది. టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ హనుమాన్ అంశ్ సినిమాను తెలుగులో రిలీజ్ చేస్తున్నారు.త్రివిక్రమ్ సమర్పణలో ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 18 న తెలుగు రాష్ట్రాల్లో రిలీజ్ చేయనుంది. నీమ్ కరోలి బాబా భక్తుల భావోద్వేగాలను, ఆయన జీవితంలోని ముఖ్య ఘట్టాలను అద్భుతంగా ఆవిష్కరించిన ఈ ఆధ్యాత్మిక సినిమా తెలుగు ప్రేక్షకులను కూడా ఎంతగానో ఆకట్టుకుంటుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. భక్తి రస చిత్రాలను ఆదరించడంలో తెలుగు ప్రేక్షకులు ముందుంటారు. ఆ కారణంతోనే ఈ సినిమాను తెలుగులోనూ రిలీజ్ చేసేందుకు చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది. ఇక హనుమాన్ అంశ్ చిత్రానికి విశాల్ చతుర్వేది దర్శకత్వం వహించారు. అలాగే ఈ చిత్రంలో శోభినావ్ సత్య, విహాన్ శెడ్గే ప్రధాన పాత్రల్లో నటించారు.

# కొత్త సినీ యుగానికి శ్రీకారం శ్రీమద్భాగవతం



సాగర్ పిక్చర్స్ ఎంటర్‌టైన్‌మెంట్ భారతీయ సినిమా ప్రపంచంలో ఒక నూతన శకానికి శ్రీకారం చుడుతోంది. ఒకప్పుడు 'రామాయణ్', 'శ్రీ కృష్ణ' వంటి అజరామరమైన దృశ్య కావ్యాలతో కోట్లాది మంది భారతీ యు ల ఇళ్లల్లో, హృదయాల్లో భక్తిపరవశాన్ని నింపి న రామానంద్ సాగర్ కుటుంబం.. ఇప్పుడు అదే ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వా న్ని వెండితెరపై అత్యంత వైభవంగా ఆవిష్కరించేం దుకు సిద్ధమైంది. భారతీయ పురాణ చరిత్రలోనే అత్యంత విస్తృతమైన కథా సముద్రం 'శ్రీమద్భాగవతం'. ఈ పవిత్ర గాథను కేవలం రెండు మూడేళ్ల వ్యవధిలో లేదా ఒకే సినిమాలో చూపించడం సాధ్యం కాదు. అందుకే దీనిని ఒక భారీ సినిమాటిక్ యూనివర్స్‌గా మలచి, మొత్తం ఏడు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఈ ఆధ్యాత్మిక మహాగాథలో తొలి అడుగుగా 'శ్రీమద్భాగవతం: పార్ట్ వన్ - విష్ణురథ' రూపుదిద్దుకుంటోంది. దివంగత రామానంద్ సాగర్ వారసత్వపు బాధ్యతలను ఆయన మనవళ్లు ఆకాశ్ సాగర్ చోప్రా, అమృత్ సాగర్ తమ భుజస్కంధాలపై వేసుకున్నారు. '1971' చిత్రంతో జాతీయ చలనచిత్ర పురస్కారాన్ని అందుకున్న అమృత్ సాగర్, అనుభవజ్ఞుడైన ఆకాశ్ సాగర్‌తో కలసి ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు పాత తరం భావోద్వేగాలను, భక్తి శ్రద్ధలను కాపాడుతూనే.. నేటి తరం ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఆధునిక సినిమాటిక్ శైలిలో ఈ కథను మలుస్తున్నారు. హైదరాబాద్‌లోని ప్రసిద్ధ రామోజీ ఫిల్మ్ సిటీలో వైభవంగా ప్రారంభమైన ఈ ప్రాజెక్ట్ కోసం అత్యంత భారీ సెట్లు, అద్భుతమైన ప్రొడక్షన్ డిజైన్‌ను సిద్ధం చేస్తున్నారు. ఈ ప్రాచీన పౌరాణిక ప్రపంచాన్ని విజువల్ వండర్‌గా మార్చేందుకు అంతర్జాతీయ సాంకేతిక నిపుణులు భాగస్వాములవుతున్నారు. వంటి ప్రపంచ ప్రసిద్ధ చిత్రాలు, సిరీస్‌లకు పనిచేసిన ప్రముఖ విజువల్ ఎఫెక్ట్స్ నిపుణుడు క్లైడ్ ఎడ్వర్డ్స్ ఈ చిత్రానికి పనిచేస్తుండటం విశేషం.

## నవ్వులు పూయిస్తున్న




# 'ఆదర్శ కుటుంబం' టీజర్

వెండితెరపై కుటుంబ కథా చిత్రాలకు సరికొత్త నిర్వచనం చెప్పిన విక్టరీ వెంకటేష్ , మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్లో తెరకెక్కిన మోస్ట్ క్రేజీ ప్రాజెక్ట్ 'ఆదర్శ కుటుంబం'. మొదటి నుంచి సినీ ప్రియులను విశేషంగా ఆకర్షిస్తున్న ఈ చిత్రం నుంచి ఎట్టకేలకు ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూసిన టీజర్ అధికారికంగా విడుదలైంది. తొలుత ప్రకటించిన సమయానికి కాస్త ఆలస్యమైనప్పటికీ చిత్ర బృందం రీ-షెడ్యూల్ చేసిన సమయానికి టీజర్‌ను యూట్యూబ్ వేదికగా విడుదల చేసి అభిమానులకు పసందైన వినోదాన్ని పంచింది. తాజాగా విడుదలైన 'ఆదర్శ కుటుంబం' టీజర్ ఆద్యంతం ఆహ్లాదకరమైన వినోదం, ఆకట్టుకునే భావోద్వేగాలతో సాగింది. విక్టరీ వెంకటేష్ మార్క్ సహజ నటన, టైమింగ్‌తో పలికించిన సంభాషణలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మరోవైపు త్రివిక్రమ్ తనదైన శైలి చమత్కారమైన డైలాగ్స్, కుటుంబ బంధాల ప్రాధాన్యతను చాటే సన్నివేశాలతో మరోసారి మ్యాజిక్ చేశారు. వెంకీలోని ఫ్యామిలీ మ్యాన్ ఇమేజ్‌ను, త్రివిక్రమ్ రాతలోని పదునును సరిగ్గా మేళవించి ఈ చిత్రాన్ని పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా మలిచినట్లు టీజర్ స్పష్టం చేస్తోంది. డబ్బుకి సబ్బుకి ఓ పోలికుంది... మొదటిది చూస్తుండగానే కరిగిపోద్ది, రెండో ఆలోచించేలోపే అరిగిపోద్ది, అడుక్కునేవాళ్లకైనా ఆదివారం ఉంటుంది గానీ ఈ అప్పులోళ్లకి ఉండదు' అనే డైలాగ్స్ త్రివిక్రమ్ మార్క్‌ని చూపిస్తున్నాయి. ఈ చిత్రంలో కేజీఎఫ్ ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుండటంతో మొదటి నుంచే ఈ జోడీపై ప్రేక్షకుల్లో విపరీతమైన ఆసక్తి ఉంది. టీజర్‌లో ఆమె స్క్రీన్ ప్రెజెన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వెంకటేష్‌తో ఆమె మధ్య వచ్చే సన్నివేశాలు చాలా ఫ్రెష్‌గా ఉండటంతో పాటు ఆమె పాత్రకు కూడా కథలో బలమైన ప్రాధాన్యత ఉన్నట్లు విజువల్స్ చూస్తే అర్థమవుతోంది. ఇప్పటివరకు సినిమా నేపథ్యంపై పూర్తి గోప్యత పాటించిన చిత్ర బృందం.. ఈ టీజర్ ద్వారా కథా వాతావరణాన్ని, పాత్రల స్వభావాన్ని పరిచయం చేస్తూ అంచనాలను ఒక్కసారిగా రెట్టింపు చేసింది. ఫ్యామిలీ ఫన్, ఎమోషన్స్‌తో పాటు క్రైమ్ అంశాలు కూడా ఈ కథలో జోడించినట్లుగా టీజర్ చూస్తుంటే అర్థమవుతోంది.